ప్రజాశక్తి ఆదివారం అనుబంధం
స్నేహ
ఫిబ్రవరి 22, 2009
సృష్టి వాదం నుండి పరిణామ వాదం వరకు...
డార్విన్ పరిణామ కథ
The DNA Network

హ్యాపీబర్త్‌డే

(2009 ఫిబ్రవరి -22 నుంచి
2009 ఫిబ్రవరి - 28 వరకు)

వైభవ్
2సం॥, ఫిబ్రవరి-24
అనిత-భూమయ్య
రుద్రూర్-నిజామాబాద్



ఎస్. నరేష్
8సం॥, ఫిబ్రవరి-2001
యాదమ్మ-యాదయ్య
ఆరుట్ల-రంగారెడ్డి

సిహెచ్. ప్రశాంత్
ఫిబ్రవరి
వనజ-సుదర్శన్
పెగడపల్లి-కరీంనగర్

మహమ్మద్ గౌస్
10సం॥, ఫిబ్రవరి-22
షహెనాజ్-గాలబ్

ఎస్. లోహిత
ఫిబ్రవరి-26
మాధవి-విజయ్‌కుమార్
వైరా-ఖమ్మం

బి. వెంకటేష్
8సం॥, ఫిబ్రవరి-20
విజయలక్ష్మి-శ్రీనివాస్
బలగ-శ్రీకాకుళం

భరత్
7సం॥, ఫిబ్రవరి-2002
లక్ష్మి-శ్రీను
గొల్లపాలెంగట్టు-విజయవాడ

కె. విష్ణువర్ధన్
2సం॥, ఫిబ్రవరి-2007
భవాని-గోపాలకృష్ణ
అరకాలవీధి-విజయనగరం

మోసిన్ అలీ
ఫిబ్రవరి-20
షాహీన్-జహాంగీర్
మౌలాలి-హైదరాబాద్

షేక్ మహ్మద్‌గౌస్
10సం॥, ఫిబ్రవరి-1999
షబానాబేగం-ఖాజామహబూబ్
ఎమ్మిగనూరు-కర్నూలు

ఎం. కౌసల్య
8సం॥, ఫిబ్రవరి-27
సౌజన్య-సురేంద్రనాథ్
యడ్లపాడు-గుంటూరు

బి. వైభవ్-మేఘన
ఫిబ్రవరి-27
మణిశ్రీ-బాలకిషన్
సింగాపూర్-రంగారెడ్డి

జి.వి. రోహన్-రోషన్
6సం॥, ఫిబ్రవరి-22
రజిత-మోహన్
వైరా-ఖమ్మం

మనలో మాట

జాగారాల పండుగ



శివరాత్రి...భక్తి కంటే రక్తి ఎక్కువ.

రాత్రంతా జనం జాగారం. గుడిలోనో దేవుడి గదిలోనో జాగారం చేసేవారి సంఖ్య ఇప్పుడు తక్కువే.

మూడవ ఆట చూస్తూనో, పేకాడుతూనో జల్సాగా జాగారం చేసే వాళ్లే ఎక్కువ.

చిత్తం శివుడి మీద భక్తి చెప్పుల మీద. ఈ కాలానికి ఈ సామెత నప్పదు. తిరగ రాసుకోవాల్సిందే.

నిజానికిదో అసలు సిసలు జాగారాల సీజన్.

పరీక్షలు ముంగిట్లో కొచ్చాయి.. చదువుల కోసం పిల్లల జాగారం. పిల్లలు చదువుతున్నారో... నటిస్తున్నారో.. ఎన్ని మార్కులతో గట్టెక్కుతారో... సీటుకోసం ఎన్ని వేలు పోయాలో... తల్లిదండ్రుల జాగారం.

శివరాత్రికి కొద్ది మాసాల ముందు నుండే హైటెక్ జీవుల జాగారం. బద్దలైన బూమ్‌తో ఉద్యోగాలుంటాయో... ఊడతాయో? దేశదేశాల్లో లక్షలాది ఉద్యోగాల గల్లంతు... శివ శివ... ఎప్పుడు ఏ వార్త వినాల్సి వస్తుందో...గుండె దడల జాగారం.

కాలగర్భానికి క్యాంపస్ సెలెక్షన్లు... రెక్కలు విరిగిన ఊహల విమానాలు... కళ్లముందు కటిక చీకటి... ఇప్పుడే బద్దలవ్వాలా పంచరంగుల ప్రపంచం... దీనికేం రోగం... ఇంకో రెండేళ్లాగొచ్చుగా... పాపం... ఫైనల్స్ దాటిన భావిపౌరుల ఆవేదనల జాగారం.

గడపలోకొచ్చిన కడప మార్కు ఎన్నికలు.. అసెంబ్లీలో సీటు ఉంటుందో.. ఊడుతుందో? టిక్కెట్టయినా దొరుకుతుందా... సర్వేపేరుతో వే మూసేసి నో ఎంట్రీ బోర్డు పెడతారా? సిట్టింగులకు ఉత్కంఠ భరిత జాగారం.

అప్లికేషన్లు... అందులో పేర్కొనే యోగత్యా ప్రమాణాలు... శుద్ధ దండగ కసరత్తు... ఎన్ని ఎన్నికలు చూడలేదూ... అయినా తప్పని తంతు... గాంధీభవన్‌కు ధరఖాస్తుల వరద... అప్లై అప్లై బట్ నో రిప్లై... బహిరంగ రహస్యం... షరా మామూలే... అమ్మ పుటిల్లు గురించి మేనమామకు చెప్పాలా... అయినా చోటామోటాలకు చావని ఆశల జాగారం.

ముందుగానే తేల్చితే గోడదూకి మరో షాపుకెళ్తాడేమో... అక్కడ టికెట్ కొనేస్తాడో ... కొట్టేస్తాడో? ఎందుకైనా మంచిది. చివరిదాకా సస్పెన్షన్ కొనసాగించాలి. కర్ర విరగరాదు పాము చావరాదు... నాయకుల అప్రమత్త జాగారం. నేరుగా చెత్తకుండీలోకి వెళ్లే ధరఖాస్తుల కోసం గాంధీభవన్ వర్గాల జాగారం. లెక్కలు చూసుకోవాలి మరి.

ఢిల్లీని తాకిన ప్రకంపనలు.. అధిష్టానం చూపుల ప్రశ్నలు... ఇన్నాళ్లు చంకనెత్తుకొన్నవారు ఇక చాలు పొమ్మంటారా? సుపుత్రా... కొంపపీకరా... అన్నట్లవుతుందేమో చివరాఖరికి... అంచనాలందని తండ్రికి జాగారమే జాగారం.

★

ఈ సంచికలో....

[illegible]పా	...	2
క్రైమ్ కథ	...	7
చూద్దామా	...	8
మంచి పుస్తకం	...	10
బాలనేస్తాలు	...	12
అట్టమీది కథ	...	14
తెల్సా	...	19
ఆరోగ్యం	...	20
కవిత్వమ్	...	22
కొత్త పుస్తకాలు	...	24

ఇంకా...

సినిమా కబుర్లు ...3

పింకీ స్మైల్ నవ్వులు పూయించేనా

కథ ...4

ముందడుగు

కథ కాని కథ... 18

పదేళ్లకే పెళ్లి... విడాకులు

రుచి ... 23



పానీపూరీలు



కవర్ బాగుంది

సంతాన లక్ష్ములు కవర్ స్టోరీ బాగుంది. సంతానోత్పత్తిని కృత్రిమంగా నియంత్రించడంపై ఆక్షేపణలున్నాయి. నవ్వుల నగేష్ ఇకలేడు. అయినా ఆయన నవ్వులు అందరి కళ్లల్లో వున్నాయి. 'స్వరాలు – సర్వేలు' నవ్వించింది. కవిత్వమ్ బాగుంది. బెనారస్ మ్యూజియం విశేషాలు కళ్లకు కట్టినట్లు చూపించారు.

బుర్రి కుమారరాజు, రత్నపురి కాలనీ, గుంటూరు.

స్వరాలు-సర్వేలు భేష్

ఫిబ్రవరి 8వ తేదీ సంచికలో మనలో మాట ద్వారా 'స్వరాలు, సర్వేలు' అంటూ ఎన్నికల వేట గురించి చెప్పిన తీరు బాగుంది. ఎవరికి వారే నేనే నెంబర్‌వన్ అనుకోవడం మర్చిపోవాలని ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏదో ప్రజలే నిర్ణయిస్తారని ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి అంటూ వెల్లడించిన వాక్యాలు బాగున్నాయి. చూద్దామాలో 'బెనారస్ మ్యూజియం చూతుము రారండి' అంటూ బోలెడన్ని ఆసక్తికరమైన విశేషాలను తెలియచేశారు. ఆనాటి రాజులకు చెందిన కళా ఖండాలతో ఒక మ్యూజియం ను ఏర్పాటుచేయడమనేది మంచి ఆలోచన. ఇది చదివాక ఆనాటి సామాజిక ఆర్థిక, రాజకీయ పరిస్థితుల అవగతమయ్యాయి. అద్భుతంగా శిల్ప సౌందర్యం ఉంది. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో బుద్ధుడు మరణించినప్పుడు ఆయన భౌతిక అవశేషాలను బెనారస్‌లో తయారైన బట్టతోనే చుట్టారని తెలిసి ఆశ్చర్యపోయాం. అక్కడున్న గడియారం ప్రత్యేకతలను చదువుతుంటే ఎంతో ఆసక్తిగా అనిపించింది. ఓ మంచి పుస్తకంలో ఘంటసాల పాడిన పాటల పుస్తకం గురించి ఇచ్చిన తీరు, పుస్తక సమీక్షను తెరగారు కొనసాగించిన తీరు బాగుంది. అట్టమీది కథ 'సంతాన లక్ష్ములు' అంటూ అమెరికాలో ఒకామెకు ఒకే కాన్పులో ఒకేసారి 8మంది పిల్లలు పుట్టారని, ఇది మనకే కాకుండా సాక్షాత్తు, ఆ సంతాన లక్ష్మికి కూడా ఆశ్చర్యమేననీ, చక్కని కారణాలు తెలియ చేసినందుకు ధన్యవాదాలు. ఇవి కాబోయే తల్లులకు మార్గ దర్శకంగా ఉంటాయి.

కర్రా వరప్రసాద్,యలమర్రు.

కవితలు బాగున్నాయి

కన్నీటి ఎజెండా, అందాల నాపల్లె కవితలు ప్రజల బాధలకు ప్రతీకలు. బెనారస్ మ్యూజియం వ్యాసం భారతీయ సంస్కృతికి ప్రతీక. చారిత్రక ప్రసిద్ధి చెందిన వస్తువులకు నిలయమిది. ఆధ్యాత్మికతకు సంబంధించినది అయినప్పటికి శిల్ప కళానైపుణ్యం చూడదగినది. మతసామరస్యపరంగా ప్రాముఖ్యత కల్గినది. కోట్లాది ప్రజల గుండెల్లో నిలిచిన అమర గాయకుడు ఘంటసాల సహస్ర మధుర గీతాలు నిండిన పుస్తక పరిచయం చాలా బాగుంది. ఎందరో రచయితల గీతాలు ఆయన మధుర స్వరంతో గానం చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయి.

టి. శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖపట్నం.

కవర్‌స్టోరీ ఆసక్తికరం

కవలలు, బహుజననాలు గురించిన శాస్త్రీయ వివరణను 8-2-09 నాటి ఆదివారం ప్రజాశక్తి అనుబంధం అట్టమీది కథ ద్వారా తెలుసుకున్నాం. వినడానికి చదవడానికి వింతగానే ఉన్నా వాస్తవంగా పిల్లల్ని కనే తల్లి పడే అవస్థలను గురించే ఎన్నో కొత్త విషయాలను ఈ కవర్‌స్టోరీ ద్వారా తెలుసుకోగలిగాం. ఆసక్తికర విశేష కళాఖండాలకు నెలవైన బెనారస్ మ్యూజియం విశేషాలను 'చూద్దామా' శీర్షిక ద్వారా తెలుసుకున్నాం. అమర గాయకుడు ఘంటసాల గళం నుండి జాలువారిన గీతాలన్నింటినీ అందించిన పుస్తకం "సహస్ర మధుర గీతాల" ను గురించిన వివరాలను ఓ మంచి పుస్తకం శీర్షిక ద్వారా తెలుసుకున్నాం. నవ్వుల నగేష్‌ను గురించి జె.పి వైద్య అందించిన వివరాలు అమూల్యమైనవి. రవ్వ స్వీటు నోరూరించింది.

గొల్లమ్మందల సురేష్‌కుమార్, సీతారాంపురం.

వింత సుమా!

ఫిబ్రవరి ఆదివారం అనుబంధంలో కవర్ చదివాం. అయితే ఒకే కాన్పులో ఎనిమిది మంది శిశువులు జన్మించడం చాలా వింతగా ఉంది. పిల్లలతో ఇల్లంతా సందడిగా సరదాగా ఉంటుంది. కానీ తల్లిదండ్రులు, ఉద్యోగాలు చేసి అలసిపోయివచ్చి పిల్లల ఆలనా పాలనా చూసుకొని ఉండటానికి తీరిక లేక చాలా అవస్థలు పడుతుంటారు. ఒక రకంగా చెప్పాలంటే ఒకపక్క సంతోషంగా ఉంటుంది. మరోపక్క బాధగా ఉంటుంది. ఎక్కడైనా ఇద్దరు లేక ముగ్గురన్నది వింటూనే ఉంటాము. అలాంటిది ఒకేసారి ఎనిమిది మంది పుట్టడం ఆశ్చర్యాన్ని కలిగించింది. తెలుగు చలన చిత్ర సినీరంగ



చరిత్రలో నవ్వుల వర్షం కురిపిస్తూ, కడుపుబ్బా నవ్వించే నవ్వుల నగేష్ చేసిన చిత్రాలలో 'భామనే సత్య భామనే, శుభాకాంక్షలు, తొలిప్రేమ' లాంటి సినిమాలు అభిమానుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచివుంటాయి. హాస్యమంటే మనదే. హాస్యనటులంటే మనవాళ్లే. ప్రపంచానికి మహా అయితే ఓ చార్లీచాప్లిన్ ఉన్నాడు. మరి మనకో ఓ రేలంగి, రమణారెడ్డి, రాజబాబు, నగేష్ ... తెలుగు నటుల ప్రతిభని ఎంతని చెప్పగలం. అప్పట్లో ఒక్కో హాస్య నటుడికి ఒక్కో జోడి ఉండేది. గిలిగింతల స్పెషలిస్టుగా బారెడు పేరు తెచ్చుకున్న నటుడు నగేష్ జ్ఞాపకార్థంగా ఈ వారం ఇచ్చిన వ్యాసాన్ని భావిస్తున్నాము. బాలనేస్తాలులో 'నవ్వు – కోపం' విచిత్రంగా ఉంది. స్వరాలు, సర్వేలు రాజకీయ వేటగాళ్ల వేటాడి నమిలేస్తారు. మనలో మాటలో రాజకీయ వేడి గురించి చక్కగా చెప్పారు. చివరి పేజీలో 'బుజ్జి కంగారు, పాము మందు' చాలా ఆశ్చర్యంగా ఉన్నాయి. పాములు, తేళ్లను సీసాల్లో బంధించటం బాగుంది. ఈ వారం స్నేహ చూడచక్కగా ఉంది.

అనుపోజు సంతోషినాగరాజు, విజయనగరం.

మీ రచనలను, ఉత్తరాలను పంపవలసిన చిరునామా...
ప్రజాశక్తి, ఆదివారం అనుబంధం
మోటూరు హనుమంతరావు భవన్, 21/1,
అజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా,
హైదరాబాద్.

సినిమా కబుర్లు



'పింకీ స్మైల్' చిన్న డాక్యుమెంటరీ. 39 నిమిషాల నిడివిగల ఈ డాక్యుమెంటరీని అమెరికన్ దర్శకుడు మెగన్ మిలన్ రూపొందించారు. ఆస్కార్ నామినేషన్‌కు ఎంపికైన నాలుగు చిన్న డాక్యుమెంటరీలలో ఇది ఒకటి కావడం మనందరికీ సంతోషదాయకమైన విషయం. ఇక కథ విషయానికొస్తే...మొత్తం పింకీ అనే తొమ్మిదేళ్ల పాప చుట్టూ తిరుగుతుంది. ఆ చిన్నారి చుట్టూ వున్న వారు ఆమెను మొదట ఎలా తృణీకరించారు? తర్వాత ఆమెను ఎలా స్వీకరించారనేదే ప్రధానాంశం. రీల్ లైఫ్‌లో పింకీ పాత్ర...దాని స్వభావం ఇది. ఇంక రియల్ లైఫ్‌లో పింకీ ఎలా వుంటుందో తెల్సుకుందాం.

పింకీ స్మైల్ నవ్వులు పూయించేనా!

పింకీ వాళ్లది రామ్‌పూర్ ధవయా అనే చిన్న గ్రామం. ఉత్తరప్రదేశ్, మీర్జాపూర్ జిల్లాలో వుంది. అక్కడికి వెళ్లాలంటే....వారణాసి నుంచి 90 నిముషాలపాటు ప్రయాణించాల్సి వుంటుంది. ఆ చిన్ని గ్రామంలో మట్టి ఇళ్లే ఎక్కువగా కనిపిస్తాయి. ప్రహరీగోడమీద సున్నంతో చెట్ల బొమ్మలు వేసిన ఇల్లే పింకీవాళ్లది. ఇప్పుడంటే పింకీ స్వచ్ఛంగా నవ్వగలుగుతోందిగానీ...గతంలో ఆ పాప మొహంలో నవ్వు చూద్దామన్నా కనిపించేదికాదు. స్కూల్లో, క్లాసులో... ఎవ్వరూ ఆమెతో ఆడుకోడానికి ఇష్టపడేవారు కాదు. పైగా ఎగతాళి చేసేవారు. 'హొూత్‌కటి' (పెదవి చీలిన పిల్ల) అని పిల్చేవారు. కారణం ఆమెకు మొర్రి వుండేది. పైపెదవి చీలి వుండేది. దాంతో అసహ్యంగా వుండేది. ఎక్కడో దాకా ఎందుకు? ఆమె తల్లికి కూడా కొంచెం అలాగే అనిపించేది. ఇదంతా పింకీని చాలా బాధపట్టేది. కోపం తెప్పించేది. భరించలేనప్పుడు వారిని తిట్టేది కూడా. తండ్రి రాజేందర్ శంకర్‌కు కూతురి గురించి ఒకటే దిగులుగా వుండేది. 'అలాంటి పిల్లకు పెళ్లి చేయడం ఎలా? అసలు ఎంత కట్నం కుమ్మరించాల్సివుంటుంది. అసలు అంత డబ్బు ఎక్కడి నుంచి తేను' అని ఒకటే మదనపడేవాడు.

ఆ తర్వాత అనుకోకుండా ఒక సంఘటన జరిగింది. ఓసారి పింకీ ఒక సంఘసేవకుడి కంట్లో పడింది. అదే ఆమె జీవితంలో నవ్వులు పూయించింది. ఆ తర్వాతే డాక్టర్ సుబోధ్ కుమార్ సింగ్ పింకీ మొర్రి పెదవికి ఆపరేషన్ చేశారు. ఇదంతా వారణాసిలోని జి.ఎస్ మెమోరియల్ ఆసుపత్రిలో జరిగింది.

మరి ఇలాంటి పిల్లకు డాక్యుమెంటరీలో నటించే అవకాశం ఎలా వచ్చింది? అన్న అనుమానం వస్తుంది కదా! జి.ఎస్.మెమోరియల్ ఆస్పత్రికి చెందిన సంఘసేవకుల బృందం కుగ్రామాలకు వెళ్లి మొర్రి వున్న వారికోసం సర్వే జరుపుతుంది. అలాంటివారు కనిపిస్తే ఆసుపత్రికి తీసుకొచ్చి ఆపరేషన్ చేయిస్తారు. ఓసారి అలా వెళ్లిన బృందంతో పాటు అమెరికన్ దర్శకుడు మెగన్ మిలన్ కూడా వున్నాడు. అలా పింకీ ఆ దర్శకుడి దృష్టిలో పడింది. తాను తీయబోయే డాక్యుమెంటరీలో ప్రధాన పాత్రధారిణిగా ఎంపిక చేసేశారు. అప్పుడు పింకీకి సరిగ్గా ఆరేళ్లు.



ఆపరేషన్ ముందు



తర్వాత

రోజుకు కనీసం 20మంది కొత్త రోగులను పరీక్షించే డాక్టర్ సింగ్ మాత్రం పింకీని చూసి ముచ్చటపడ్డారు. అందుకో కారణం వుంది. "పింకీ మా ఆసుపత్రిలోని డాక్టర్లు, నర్సులతో చాలా చక్కగా మాట్లాడేది. ఆపరేషన్ పూర్తయ్యాక అద్దంలో తనను తాను చూసుకున్నప్పుడు ఆమె ఎంతో సంతోషించింది. నొప్పి మూలంగా ... అది పెదవులమీద చిరునవ్వు రూపంలో కనిపించకపోయినా ఆమె కళ్లు మాత్రం బోలెడన్ని విషయాలు చెప్పాయి' అంటారు డాక్టర్ సింగ్.

ఆ తర్వాత కూడా చాలా మార్లు పింకీ హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స చేయించుకుంది. అనంతరం పింకీ డాక్యుమెంటరీలో నటించింది. ఇంక అప్పటినుంచి ఆమె జీవితమే మారిపోయింది. ఇదివరలోలా మొహం తిప్పుకోకుండా అందరూ ఆమెను చూసి నవ్వుతున్నారు. చక్కగా పలుకరిస్తున్నారు. తనతో కలిసి ఆడుకుంటున్నారు. అన్నిటినీ మించి తనను 'హొూత్‌కటి' అని పిలవడం మానేశారు. ఇదంతా ఆ చిన్నారి కలలో కూడా ఊహించలేదు. రెండు సంవత్సరాల క్రితం ఆమెను అందరూ వెక్కిరించారు. ఇప్పుడు ఆమె ఎక్కడ వుంటే అక్కడ పెద్ద స్టార్. అక్కడ కట్ చేస్తే....

ఇప్పుడు ఈ నెల 22న జరగబోయే ఆస్కార్ అవార్డుల ఉత్సవంలో పాల్గొనడానికి పింకీ తన కుటుంబీకులు, డాక్టర్ సింగ్‌తో కలిసి లాస్ ఏంజల్స్ వెళ్లనుంది. అంటే ఇవాళే... బహుశా ఈపాటికి వెళ్లే వుంటుంది.

పింకీ చదువుకుంటున్న స్కూల్లో పిల్లలు, టీచర్లు అంతా...ఇప్పుడు ఏమని ప్రార్థిస్తున్నారంటే...! పింకీ స్మైల్ డాక్యుమెంటరీకి ఆస్కార్ అవార్డు రావాలని!! ★

కథ

ముందడుగు

మూలం : సుషమా మునీంద్ర్

అనువాదం : ఆర్.శాంతసుందరి

లీల అతన్ని అదే డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లో రెండోసారి కలుసుకోవటం. ఆమెకి చాలా ఆశ్చర్యం అనిపించింది. మొదటి సారి కలుసుకొన్నప్పుడు అది ఒక యాక్సిడెంట్ అని అనాలి. లీల స్టోర్‌నించి బైటకొచ్చి, పేవ్‌మెంట్ మీద నిలబడి ఖాళీ రిక్షా ఏమైనా దొరుకుతుందా అని చూస్తోంది, అప్పుడే అతను హఠాత్తుగా ఎక్కణ్ణించో వూడిపడి ఆమె పర్సు లాక్కుని పరిగెత్తసాగాడు.

ఇవాళ ఆ పర్సుదొంగ అదే స్టోర్‌లో కూర్చుని కంప్యూటర్‌లో బిల్లు వేస్తున్నాడు. ఆరోజు దీనంగా కనిపించిన ఆయువకుడికీ ఇవాళ టిప్‌టాప్‌గా ఉన్న ఇతనికీ పోలికే లేదు. అందుకే లీల కళ్లు మొదట అతన్ని గుర్తుపట్టినప్పటికే ఆమె మనసులో ఏమూలో, అతను కాదేమో అన్న సందేహం లేకపోలేదు. అందుకే అతన్ని ఏమీ అడగలేకపోయింది. కానీ అతను మాత్రం వెంటనే ఆమెను గుర్తుపట్టినట్టు "అమ్మా... మేడమ్... మీరా? నేను... జగన్నాథ్‌ని..." అన్నాడు.

సహజంగా అతని నోటివెంట ఆ మాటలు వచ్చాయే కాని, మరుక్షణం అతను వణికి పోయాడు.

"అరె నువ్వా?, శభాష్! నేను చెప్పా కదా, ఏదో ఒకరోజు నీకు మంచి రోజులు వస్తాయని!" లీల మొహంలో ఇంకా ఆశ్చర్యం తొణికిసలాడుతూనే ఉంది.

" మీరు చెప్పిన ఆమాటే నాకు భరోసా ఇచ్చింది. మేడమ్! "

లీల నవ్వింది, "ఎకౌంట్స్ రాయటం చేతయితే మాకు కూడా నీ అవసరం రావచ్చు. నా ఫోన్ నంబర్ రాసుకో. టైమ్ దొరికినప్పుడు రా!" అంది.

"తప్పకుండా వస్తానమ్మా!" జగన్నాథ్‌కి ఇందాకటి బెరుకు కొంత తగ్గినట్టు అనిపించింది. "ఆరోజు నన్ను ఆపదనించి కాపాడిన ఈవిడ నా రహస్యం బైటపెట్టి నా ఉద్యోగం ఎందుకు ఊడగొడుతుంది". అనుకొన్నాడు.

ఆ సంఘటన తాలూకు ప్రభావం క్రమక్రమంగా తగ్గిపోతూ దాదాపు లేకుండా పోయిందనే చెప్పాలి కానీ జగన్నాథ్‌ని చూడటంతో అది మళ్లీ లీలకి వివరంగా గుర్తుకొచ్చింది. జగన్నాథ్ ఆమె చేతిలోని పర్సు లాక్కుని ఏం జరిగిందో తెలుసుకునే లోపలే అతను ఆమడదూరం పారిపోయాడు. పర్సు దొంగిలించుకొని పోతుంటే అరవాలని కూడా తోచలేదు! తీరా అరవాలని ప్రయత్నిస్తే పెదాలు కదిలాయి కానీ లోపల్నించి శబ్దం రాదే! ఎంతో ప్రయత్నించిన మీదట దొంగ... దొంగ.. పట్టుకోండి ! అని అరవగలిగింది. మధ్యాహ్నం మండుటెండ నెత్తి మాడుస్తోంది. రోడ్డుమీద జన సంచారం ఆట్టే లేదు. ఉన్న ఇద్దరో ముగ్గురో వాళ్ల ఆలోచనల్లో వాళ్లున్నారు. వాళ్లేమీ పట్టించుకోరేం? నా కేకలు వినిపించడంలేదా? లేక వినదల్చుకోలేదా? జనం ఇలా ఉండబట్టే సమాజంలో నేరాలు పెరిగిపోతున్నాయి. ఇక పర్సుమీద ఆశ వదులుకోవలసిందే అనుకునే సరికి లీలకి కోపమూ దుఃఖమూ ముంచుకొచ్చాయి. నిజ జీవితంలో సినిమా హీరోలు ఎక్కడుంటారు? ప్రాణాలకు తెగించి, దొంగ వెంటబడి వాడిని చితకతన్ని పర్సు లాక్కుని ఇచ్చేవాళ్లు సినిమాల్లో ఉంటారు, అంతే. గుడ్డిలో మెల్ల, లీల షాపింగ్ చెయ్యటం అయిపోయింది. పర్సులో మూడు వందలకన్నా ఎక్కువ లేవు కానీ ఇంటి తాళాలూ, అల్మార తాళాలూ పర్సులోనే ఉన్నాయి! ఆ తాళాలు పగలగొట్టాల్సిందే. కొత్త తాళాలు కొనడం, అదో డబ్బు దండగ. తాళాలు బద్దలు కొట్టేవాడికోసం ఎలా వెతకాలి? వాడు దొరికి తలుపులు తీసేదాకా ఈ ఎండలో మాడుతూ వీధిలో నిల్చోవాల్సిందే. అడ్వకేట్‌గా పనిచేసే మాఆయన కేదార్, "చాలా జాగ్రత్తగా ఉంటాననీ, తెలివైనదాన్ననీ విర్రవీగుతావు కదా ఇప్పుడు తెలిసిందే?" అని తనని ఎకసెక్కం చేస్తాడు. ఓ దేవుడా! ఆ దొంగకి నా పర్సే దొరికిందా? దొరకనీ వాడి పని పడతాను, చెప్పుతో కొడతాను వెధవని! ఈ దొంగ వెధవలవల్ల నిశ్చింతంగా ఉండలేం కదా! మనిషికి ఇంటా బయటా కూడా భద్రత లేకుండా పోయింది. దొంగలూ, హంతకులూ, టెర్రరిస్టులూ! కొద్దిమంది దుర్మార్గాలు మొత్తం ప్రపంచాన్ని దారెత్తిస్తున్నారు! ఇలా సాగుతున్నాయి. లీల ఆలోచనలు.

ఓ దేవుడా! ఆ దొంగకి నా పర్సే దొరికిందా? దొరకనీ వాడి పని పడతాను, చెప్పుతో కొడతాను వెధవని!

ఆ రోడ్డులో మలుపులేవీ లేకపోవటంతో దొంగ ఇంకా దూరంగా లీలకి కనిపిస్తూనే ఉన్నాడు. ఎక్కడైనా మలుపు కనిపిస్తే అందులోకి దూరి మరి కనిపించాడు! కానీ పర్సు పోయినంత హఠాత్తుగానే దొంగ కూడా పట్టుబడ్డాడు. తన ధ్యాసలో తానుండి వేగంగా పరిగెత్తుతున్న దొంగని ఎదురుగ్గా వస్తున్న ముగ్గురు కుర్రాళ్లు పట్టుకున్నారు. లీల అక్కడికి చేరుకునేసరికి పెద్ద గుంపు గుమిగూడింది. ఆ కుర్రాళ్లు దొంగని చావగొట్టడం చూసింది లీల. కొంతమంది ఇంకా కొట్టుమని వాళ్లను రెచ్చగొడుతున్నారు.

"వీళ్లవల్ల నెమ్మది లేకుండా పోయింది. ఇళ్ల తాళాలు పగలగొట్టి దోచుకోవటం, కిడ్నాపులు చెయ్యటం, జేబులు కత్తిరించటం రైళ్లల్లో మత్తుమందు కలిపిన పదార్థాలు తినిపించి ఉన్నదంతా ఊడ్చెయ్యటం, ఒకటా? కొట్టండి వెధవని మక్కెలిరగదన్నండి!"

"అరే! ఈ రోజుల్లో వందా రెండు వందల కోసం మర్డర్లే చేసేస్తున్నారు. మాట్లాడితే గన్నులు చూపిస్తున్నారు. కత్తులు చూపించి బెదిరిస్తున్నారు. ఎలాంటి హత్యలు! ఎవరు చేశారో, ఎలా చేశారో కూడా అంతుపట్టని నేరాలు!"

"అవును పోలీసులు, ప్రభుత్వమూ చేతులు ముడుచుక్కూర్చుంటే జరిగేది ఇదే! అరాచకాలూ, అన్యాయాలూ, హత్యలూనూ!"

మసాలా దినుసుల్లో కల్తీ... పళ్లు కురగాయల్లోనూ, ధాన్యాల్లోనూ, పురుగులమందులు... తాగేనీళ్లలోనూ, పీల్చేగాలిలోనూ, విషం! ఇక ఎలా చచ్చేది? ఏం తినాలి, ఏం తాగాలి? ఇంకా జీవితం మీద ఇసుమంత ఆశ ఉంటే దాన్ని ఇదుగో ఇలాంటి దొంగవెధవలు చంపేస్తారు! చేతులు విరగ్గొట్టండి... మళ్లీ జీవితంలో ఎవరి పర్సు దొంగిలించకుండా ఉంటాడు!

జనం దొంగ చుట్టూ వలయంగా నిలబడ్డారు. అందరి మొహాల్లోనూ, కోపం ఉద్రిక్తత. పగ తీర్చుకోవాలన్న భావన. మధ్యలో ఉన్న దొంగ చాలా ఆర్భకంగా దీనంగా తన్నులు తింటున్నాడు. వాడి చొక్కాకున్న బొత్తాములన్నీ తెగిపోయాయి. చెప్పులు దూరంగా చెరో మూలా పడున్నాయి. చేతులడ్డం పెట్టుకుని దెబ్బల్నించి తప్పించుకోవాలని చూస్తున్నాడు. వయసు పాతికేళ్ల లోపే ఉంటుంది.

లీలకి ఇలాంటి హింసను ప్రత్యక్షంగా చూడటం ఇది మొదటిసారి. ఆమె అదంతా చూడలేకపోయింది. ఒక పక్క దొంగమీద కోపం ఉన్నా అతనలా నిస్సహాయంగా తన్నులు తినటం భరించలేకపోయింది. అతను చేసిన తప్పుకి ఇంత పెద్ద శిక్ష ఎక్కువనీ, అనవసరమనీ అనుకుంది. నడివీధిలో ఇలా చావుదెబ్బలు తింటానని పాపం అతను అనుకుని ఉండడు. అతను పట్టుబడకుండా ఉంటేనే బావుండేదేమో, అనిపించిందామెకి. దొంగ కింద పడిపోయాడు. లీలకి భయం వేసి పెద్దగా అరిచింది. "వదలండి... చంపేస్తారా ఏమిటి?" అంది. తన్నేవాళ్లు చివరి సారిగా రెండు దెబ్బలు వేసి మరీ ఆపారు. ఆ గోలంతా సద్దుమణిగాక ఎవరో లీలకేసి తిరిగి "వీణ్ణి వదిలి పెట్టమంటున్నారా? నిజానికి వీణ్ణి పోలీసులకు అప్పగించాలి" అన్నారు.

"ఒద్దు వదిలెయ్యండి... భయంతో లీలకి మాటలు కూడా సరిగ్గా రాలేదు"

"వదిలేస్తే మళ్లీ ఇంకెంతమంది పర్సులు దొంగిలిస్తాడో!"

"వదిలెయ్యండి. నా పర్సు నాకు దొరికిందిగా. చేసిన తప్పుకి శిక్ష కూడా అనుభవించాడు. అతన్ని వెళ్లనివ్వండి"

"మీది దొరికింది, రేపు మరొకరిది దొరకదనుకోండి. అప్పుడో?"

"వీణ్ణి పోలీసులకప్పగించి ఈ సమస్యని పరిష్కరించాల్సిందే!"

లీల కాస్త నిలదొక్కుకుంది. అతణ్ణి పోలీసులకు అప్పగించవద్దనీ, ఇంతటితో ఆపెయ్యమనీ వాళ్లకి నచ్చజెప్పింది.

దొంగ చేతుల్లో మొహం దాచుకుని కాలుతున్న రోడ్డు మీద కూర్చుని ఉన్నాడు. అతనికి చాలా అవమానంగా ఉంది. ఇది మొదటిసారి అతను దొంగతనం చెయ్యటం. అది కాస్తా ఫెయిలయ్యింది. తన్నులూ తినవలసి వచ్చింది. అతని నడిరోడ్డుమీద తిట్లూ, శాపనార్థాలూ, తన్నులూ తినవలసి వచ్చింది. అతని ఒళ్లు నుజ్జు నుజ్జయింది. లేచి నిలబడబోయి, తూలాడు కళ్లు బైర్లు కమ్మాయి. కాళ్లు జవజవలాడుతున్నాయి. కొంతసేపటికి తేరుకొని లీల

"మేడమ్ లాంటివారే ఈయన కూడా. కొందరు అవతలి వాళ్లని ఎంత బాగా అర్థం చేసుకోగలరు!"

దగ్గరకొచ్చి "మేడమ్ గారు! నేను దొంగని కానండీ, నిరుద్యోగినండీ. బీ. కామ్ పాసయ్యాను కానీ ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. నాకు దొంగతనం చెయ్యటం ఇష్టంలేదు. నాకు పని కావాలి. నిజం చెపుతున్నాను. మేడమ్ గారూ, ఈ రోజు నా జీవితంలో మొదటిసారి నేరం చేశాను, పట్టుబడ్డాను!" అన్నాడు. అతని మాట తీరు చూస్తే చదువుకున్నవాడిలాగే కనబడ్డాడు.

"పట్టుబడ్డాక దొంగలందరూ చెప్పే కట్టుకథే ఇది!" అన్నారు ఎవరో. దొంగ అతనివైపు తిరిగి "ఇది కథ కాదండీ. ఎక్కడా ఒక చిన్నపాటి ఉద్యోగమైనా దొరకటం లేదు. ఇంట్లో వాళ్లు సూటిపోటిమాటలతో నన్ను పొడుస్తున్నారు. నాకు పని చెయ్యాలని లేదనీ, బద్ధకస్తుణ్ణనీ, పని దొరకటం లేదని అబద్ధమాడుతున్నాననీ నా ప్రాణాలు తోడేస్తున్నారు. మీలో ఎవరైనా నాకొక చిన్న పని చూపించండి. నిజాయితీగా పని చేసి, నేను మంచివాణ్ణని నిరూపించుకుంటాను" అన్నాడు పర్సు కొట్టేసిన ఆ యువకుడు.

"మేడమ్ మీరేగా. ఈ నిజాయితీగల దొంగని మా నుంచి కాపాడారు! పని కూడా మీరే ఇప్పించండి, మరి!" అన్నారెవరో.

అక్కడ ఉన్నవాళ్లందరూ ఇలా లీలని ఎకసెక్కం చెయ్యసాగారు. లీలకి ఏం జవాబు చెప్పాలో తెలియదు. దొంగని చూస్తే ఆమెకు నిజంగానే చాలా జాలేసింది. అందుకే అతని పక్షం వహించింది. అతని మాటల్ని ఆమె నమ్మకుండా ఉండలేక పోయింది. ఇతను ఎన్నడూ దొంగతనం చెయ్యలేదు. ఈ విద్య తెలిసినవాడైతే ఒంటరిగా వచ్చి ఇలా పట్టుబడేవాడు కాదు. దొంగతనాలు ఎప్పుడూ ముగ్గురు నలుగురు కలిసి చేస్తారు. పర్సు మెరుపు వేగంతో చేతులు మారిపోతుంది. అసలు దొంగని పట్టుకోవటం ఎవరివల్లా కాదు. ఒకసారి రైలు ఎక్కుతుండగా కేదార్ జేబులోని పర్సు పోవటం లీలకి గుర్తొచ్చింది. పైన కోటుంది. లోపలి జేబులో పర్సుంది. అయినా దొంగ భలే నేర్పుగా దాన్ని కొట్టేశాడు. రైలెక్కబోతుండగా కేదార్‌ని ఎవరో వెనకనించి తోశారు. ఆయన నిలదొక్కుకునే లోపల జేబు కత్తిరించి పర్సెత్తుకుపోయాడు ఇంకొకడు.

యువకుడు మాటిమాటికీ "నేను దొంగని కాను, నాకు పనిప్పించండి మేడమ్" అంటూ ఉండేసరికి లీలకి విసుగొచ్చింది. "దొంగతనం చేసి దొంగని కానంటావేంటి? ఎంతో మంది నిరుద్యోగులున్నారు. లోకంలో వాళ్లందరూ నీలాగ దొంగతనాలు చేస్తున్నారా?" అంది.

"దొంగతనమేమిటి మేడం? ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఎక్కడా పనిదొరక్క ఇంట్లో వాళ్లు 'దమ్మిడీకి కొరగాని వెధవా' అని తిడుతూంటే ఏం చేస్తారు చెప్పండి? ఈరోజు శపథం చేసి ఇంటినుంచి బైలుదేరాను. ఎలాగైనా సరే డబ్బు సంపాదించి చూపించాలనుకున్నాను. దొరికి పోయాను. మీరేదో కాస్త మెత్తటి మనిషి కాబట్టి సరిపోయింది. లేకపోతే...."

ఒక్కరొక్కరుగా జనం అక్కణ్ణించి కదిలారు. లీలకి తను మండుటెండలో ఇంతసేపట్నించీ నిలబడి ఉన్నానని తెలిసి వచ్చింది. పాపం! ఆ యువకుడు

ఎంత అవమానాన్ని పొందాడు, అనుకునేసరికి, ఆమెకి గిల్టీగా అనిపించింది. అతనికి ఏదో విధంగా సాయం చెయ్యాలనిపించింది. ప్రస్తుతం యాభైరూపాయలిద్దామనుకుంది. కానీ దొంగతనం చేసిన వాడికి డబ్బివ్వటం మూర్ఖత్వం అనిపించుకుంటుందేమో, అని కూడా అనిపించింది. పెద్దపెద్ద దుకాణాల్లో ఎన్నిసార్లు చీరలు, నగలూ కొనేప్పుడు, వాళ్ళు ఎంత టోపీ వేసినా నోరుమూసుకుని డబ్బు చెల్లించలేదు? వాళ్ళూ ఒకరకంగా దొంగలేకదా? పాపం, ఈ పేద కుర్రాడికి యాభైరూపాయలిస్తే తప్పేముంది. అని తనలో తను వితర్కించుకుంది.

"చూడూ! నువ్వు చాలా కష్టాల్లో ఉన్నట్టున్నావు. ఇలాంటి పనులు చేస్తే నీకష్టాలు ఎక్కువవుతాయేతప్ప తగ్గవు. కష్టాలని ఎదుర్కొని బతకటం నేర్చుకో! ఇంద ఇది ఉంచు!" అంటూ అతనికి యాభైరూపాయల నోటిచ్చింది.

దాన్ని చూడగానే ఆ యువకుడు ఏడుపు మొహం పెట్టి "వద్దండీ...!" అన్నాడు.

"ఫరవాలేదు, తీసుకో. ఇవాళ ఇక్కడ జరిగినదంతా మర్చిపో. మర్చిపోకపోతే అది నిన్ను తొలుస్తూనే ఉంటుంది. ఇది ఒక దుర్ఘటన అనుకో, తెలిసిందా?" అంది లీల.

ఆ యువకుడికి ఇదంతా ఏదో కలలాగ ఉంది. చాలా కొద్ది సమయంలో అతను మనిషిలో ఉండే అసహాయతనీ, నేర ప్రవృత్తిని, కూరత్వాన్నీ దయా సానుభూతీ, మానవత్వాలనీ చూశాడు. అతను అవమాన భారంతోనూ, కృతజ్ఞతా భావంతోనూ, కుంగిపోతూ, ఏమీ మాట్లాడలేకపోయాడు. డబ్బు తీసుకోనని కూడా గట్టిగా చెప్పలేని స్థితిలో అతను ఆ నోటుని తీసేసుకున్నాడు.

"నీ పేరేమిటి" అడిగింది లీల.

"జగన్నాథ్"

"చూడు జగన్నాథ్! నేను చెప్పేది జ్ఞాపకం ఉంచుకో. నీకు కూడా మంచి రోజులు వస్తాయి"

ఆ తరువాత తల వంచుకొని రోడ్డు వారగా నడుచుకుంటూ వెళ్ళిపోతున్న జగన్నాథ్ రూపం చాలా రోజుల వరకు లీలని వెంటాడింది. ఈ లోకంలో ఎన్ని అసమానతలున్నాయి. ఒకళ్ళు వేలకు వేలు తగలేసి ఫైవ్‌స్టార్ హోటల్లో భోజనం చేస్తే మరొకళ్ళు ఆకలిని జయించటానికి చట్టవిరుద్ధమైన పనులు చేస్తారు. పెద్ద పెద్ద పదవుల్లో ఉన్న ఆఫీసర్లు లంచాలు మరిగినా, అందరూ వాళ్ళనీ గౌరవిస్తారు. జగన్నాథ్ లాంటి వాళ్ళు అతి చిన్న నేరానికి కూడా ఘోరమైన శిక్ష అనుభవిస్తారు. పెరుగుతున్న నిరుద్యోగ సమస్య యువకులను తప్పుదారి పట్టిస్తోంది. ర్యాలీల్లో చేరటమూ, నేరాలు చెయ్యటమూ, అనే చక్రవ్యూహంలో చిక్కుకుంటున్నారు. ఇంట్లో బైటా కూడా వీళ్ళకి తిట్లూ, శాపనార్థాలూ, లేకపోతే అసలు పట్టించుకోవటమూ జరుగుతోంది. జగన్నాథ్ మిట్ట మధ్యాహ్నం ఎండలో తన్నులు తింటున్నాడు. ఇంటిపట్టున సుఖంగా పడుకున్న అతని కుటుంబానికి అసలు తెలుసా? అతనీ విషయం ఇంట్లో వాళ్ళకి చెప్పుంటాడా? అప్పుడైనా వాళ్ళు కాస్త మెత్తబడి ఉంటారా? అతనికి ఉద్యోగం దొరికి ఉంటుందా? ఇలా అతన్ని గురించిన ఆలోచనలు ఆమెని చాలా రోజుల వరకూ చుట్టుముడుతూనే ఉన్నాయి.

ఏమండీ! నా పర్సు దొంగిలించాడే... జగన్నాథ్ అనే కుర్రాడు అతను ఇవాళ డిపార్టుమెంటల్ స్టోర్‌లో కనబడ్డాడు.

మరి ఈరోజు డిపార్టుమెంటల్ స్టోర్‌లో అదే జగన్నాథ్ కంప్యూటర్ దగ్గర కూర్చుని బిల్లు తయారు చేస్తూ కనిపించాడు. పైగా లీల అతనికి మరో ఉద్యోగం ఇప్పిస్తానని వాగ్దానం కూడా చేసింది.

కేదార్ ఛాంబర్‌లో అసిస్టెంట్‌గా పనిచేసే ఒక ముసలాయనకి తరచూ ఆరోగ్యం పాడవుతూ ఉండటంతో రోజూ ఆఫీసుకి రాలేకపోతున్నాడు. ఆయనకీ వయసు మళ్ళింది.ఆయన రాకపోవటం వల్ల కేదార్ ఇబ్బంది పడుతున్నాడు. అతను వార్తాపత్రికలో ప్రకటన కూడా ఇవ్వాలనుకుంటున్నాడు. అలాంటప్పుడు జగన్నాథ్‌ని పనిలో పెట్టుకొని కొన్నాళ్ళు ఎలా పని చేస్తాడో చూడొచ్చు కదా! జగన్నాథ్ వస్తాడో రాడో అనేది సందేహమేకాని, ఆ విషయం కేదార్‌కి తెలియాలని లీల భర్తతో "ఏమండీ! నా పర్సు దొంగిలించాడే... జగన్నాథ్ అనే కుర్రాడు అతను ఇవాళ డిపార్టుమెంటల్ స్టోర్‌లో కనబడ్డాడు. కంప్యూటర్ బిల్లింగ్ పని చేస్తున్నాడు. మీకు సహాయంగా ఉంటాడని అతనికి మన ఫోన్ నంబర్ ఇచ్చాను. కానీ తప్పు చేశానా అని ఇప్పుడనిపిస్తోంది!" అంది లీల.

కేదార్ నవ్వాడు. అతను ప్రతి విషయాన్ని తేలిగ్గా తీసుకుంటాడు. "లీలా, ఇది నీకొక చెడ్డ అలవాటుగా మారింది. ముందు ఏదో ఒకటి చేసేసి ఆ తర్వాత అది తప్పా, రైటా అని ఆలోచిస్తావు. జగన్నాథ్‌ని రమ్మన్నావు కదా? రానీ, చూద్దాం ఎలాంటి వాడో!" అన్నాడు.

"అయినా...."

"ఏమిటి అయినా? ఏం మళ్ళీ ఏదైనా దొంగిలిస్తాడనుకుంటున్నారా?"

"అయినా వకీలు దగ్గరేముంటుంది. దొంగిలించడానికి? పుస్తకాలు ఫైళ్ళూ దొంగిలించడు కదా? ఆ రోజు జరిగినదాన్ని బట్టి అతన్ని అంచనా వెయ్యటం సరికాదు. తప్పనిసరి పరిస్థితుల్లోనే అతను అలాంటి పని చేసి ఉంటాడని నాకనిపిస్తోంది. అసలతన్ని రానీ. నిజాయితీగా చక్కగా పని చేస్తే అతనికీ మంచిది. నాకు మంచిది"

జగన్నాథ్ మర్నాడే వచ్చాడు. కేదార్‌కీ లీలకీ కాళ్ళకి దణ్ణం పెట్టి "అమ్మా! మిమ్మల్ని మళ్ళీ ఈ జన్మలో కలుస్తాననుకోలేదు" అన్నాడు.

లీల నవ్వి "కోరిక బలంగా ఉంటే అది తప్పకుండా నెరవేరుతుంది. ఈయనే మావారు. కేదార్" అంది!

"రావోయ్, జగన్నాథ్! ఇలా కూర్చో. ఎకౌంట్స్ పని తెలుసు గదా నీకు? నీ క్వాలిఫికేషన్స్ ఏమిటి?" కేదార్ వకీలు. ప్రశ్నలు వెయ్యటం అతనికి అలవాటు. జగన్నాథ్‌ని చాలా ప్రశ్నలు వెయ్యటం అతనికి అలవాటు. జగన్నాథ్‌ని చాలా ప్రశ్నలే అడిగాడు.

జగన్నాథ్ బిడియపడుతూ, "బీ.కా.మ్. చదివానండీ. ప్రస్తుతం లా చదువుతున్నాను" అన్నాడు. తను పర్సు దొంగిలించానన్న భావం అతని మనసులో ఇంకా ఉండిపోయింది.

"నాదగ్గర పని చేస్తావా?" అని అడిగాడు కేదార్.

"మేడమ్ లాంటివారే ఈయన కూడా. కొందరు అవతలి వాళ్ళని ఎంత బాగా అర్థం చేసుకోగలరు!" అనుకుంటూ జగన్నాథ్ ఎంతో కృతజ్ఞతతో "ఒక్క అవకాశం ఇచ్చి చూడండి సార్!" అన్నాడు.

"నీ ఇల్లెక్కడ?"

తనుండే చోటు పేరు చెప్పి..."మాది సొంత ఇల్లు సార్. మా నాన్న హెడ్ పోస్ట్ మాస్టరండీ!" అన్నాడు.

"శ్రద్ధగా మనసుపెట్టి పని చేస్తావుగా?"

"నాగురించి నేనేమీ చెప్పను సార్! నా పని చూసి మీరే మీ అభిప్రాయం చెపుదురుగాని"

"సరే రేపట్నించీ పనిలో చేరు"

"అలాగే సార్"

టీతాగి జగన్నాథ్ వెళ్ళిపోయాడు. లీల అతను కనుమరుగయ్యేదాకా చూస్తూ నిలబడింది. ఈ రోజు అతని నడక చురుగ్గా ఉంది. తల వంచుకుండా నిటారుగా నడుస్తున్నాడు. ఆమెకు చాలా సంతోషం వేసింది. ఒక్కరినైనా భయంకరమైన అంధకారంలోంచి బైటికి తీసుకువచ్చి, అతను జీవితాన్ని కొత్తగా ప్రారంభించటానికి తను సాయపడిందని లీలకి సంతోషం! ★

క్రైమ్ కథ

బ్లాంక్ చెక్

- యర్నాగుల సుధాకరరావు

కొరియర్ కవర్ అందుకున్న లతీఫ్‌కు అంతా అయోమయంగా ఉంది. తనకంటూ ఒక అడ్రసు లేదు. మరెలా ఈకవర్ కొరియర్‌లో వచ్చింది. తాను నేరాలు చేయడానికి వచ్చేటపుడు ఎవడో ఒకనేరగాడి నీడలో రోజులు గడిపేసి పోవడమే. అంతకుమించి అడ్రసు అంటూ ఉండదు. ఇంతకీ కవర్‌లో ఏముంది? అని కవర్ చూశాడు. అందులో ఒక లేఖ ఉంది. అదీ టైప్ చేయబడి పొడిపొడిగా రాసుంది. నువ్వు చేయాల్సిన పని చేసేయ్. నేను కోరుకున్నది అదే. అందుకే నీకు ఈబ్లాంక్ చెక్ పంపుతున్నాను. నీకు కావాల్సినంత వేసుకుని తీసుకో! అని ఉంది.

లతీఫ్ ఆలోచనలో పడ్డాడు. చెక్ జేబులో పెట్టుకుని మధ్యాహ్నం ఒకబ్యాంకుకు వెళ్లి చెక్‌మీద ఎకౌంట్ నెంబర్ గురించి ఆరాలు తీశాడు.వారు వెంటనే చెప్పారు.శేర్ రాజ్‌వర్మ. ఆయన ఎకౌంట్‌లో ఒకగంటక్రితం ఇరవై లక్షలుండేది.ఇప్పుడే విత్‌డ్రా చేశారు. ఇలా బ్లాంక్‌చెక్ ఇచ్చేటపుడు ఆయన కొంత మాత్రమే ఉంచి మిగతాది తీసేస్తాడు. ఎకౌంట్‌లో మిగిలింది కేవలం రెండున్నర లక్షలు మాత్రమే. నీకు కావాలంటే చెక్ నింపు కుని ఐదువేలువదిలి మిగతాదానికి రాసుకో. ఇచ్చేస్తాను" అని చెప్పాడు బ్యాంకు మేనేజర్.

లతీఫ్ తలూపి "సార్ ఆయన ఫోన్‌నెంబర్లు ఇవ్వండి. నా దగ్గర మిస్సయ్యాయి" అని కోరాడు.

"ష్యూర్" అని కంప్యూటర్‌లో ఫీడ్ అయిన రాజ్‌వర్మ నెంబర్లు వరుసగా చెప్పాడు. అందులో రెండు సెల్‌నెంబర్లున్నాయి. ఒక దానికి రింగ్‌చేశాడు లతీఫ్.

> **నిన్ను మా వలలోకి ఎలా నెట్టుకు రాగలిగామంటే కేవలం రెండున్నర లక్షలు రూపాయలు నీకు చెక్ రూపంలో ఇవ్వడంతో నీవు ఏకంగా మావలలోకి వచ్చేశావు.**

"చెప్పు లతీఫ్ భయ్యా! నేను నీఫోన్‌కోసం చూస్తున్నాను.నీవు చేయాల్సినపని నీకు చేయమన్నవాడికంటే నాకే కావాలి. వాడు నీకు ఒకలక్ష ముట్టచెప్పి ఉంటాడు.ఎందుకంటే కిరాయికి పనిచేసే నేరగాళ్ల సంఖ్య పెరిగింది. దాంతో వారికి ఇవ్వవల్సినది తగ్గింది. అయితే నేను పాతధరలే చెల్లిస్తుంటాను. నీకు పంపిన చెక్‌తో రెండున్నర లక్షలు తీసుకో! నీవు వచ్చినపని పూర్తి చేసేయ్!" అవతలివైపు నుంచి రాజ్‌వర్మ గొంతు ఖంగుమంది.

"అసలు నేను చేసే పని ఏమిటో మీకు తెలుసా?" లతీఫ్ బ్యాంకులో ఎవరూ వినకుండా లోగొంతుతో అడిగాడు.

"మర్డర్. అంతకుమించి నాచే చెప్పించకు. నీవు ఏపనిమీద వచ్చావో ఎవరు పిలవగా కలకత్తా నుంచి వచ్చావో నాకు తెలుసు కనుకనే నీసెల్‌ఫోన్ నెంబర్, నీవు ఎవరింట్లో ఉంటున్నావో అంతా నావద్ద ఉంది. అంటే నేను ఎంతఫాస్టుగా ఉన్నానో ఈసరికే గుర్తించి ఉంటావు"

"సరే, మర్డర్ అనేది ఒక్కోసారి వర్కవుట్ కాకపోవచ్చు. మరి మీరు ఇచ్చిన పారితోషికం మాటేమిటి?"

"ఇలాంటి విషయాలలో లక్షలు కోట్లు నాకు ఏమీకాదు.నీవు కిరాయికి వచ్చాక ఆపని పూర్తిచేయకుండాపోవు అని నాకు తెలుసు.అందుకే నీకు ముందే ముట్టచెప్పాను.ఎప్పుడు మర్డర్ చేస్తున్నావు?"

"ఇక విషయానికి వద్దాం.నేను చంపాల్సింది.ఈసిటీలో పేరున్న బిజినెస్‌మాన్ గజేంద్రను, అతడితో మీరు చాలా ఇబ్బందులు పడుతున్నారా?"

"గజేంద్రతో బాధపడనివాడు ఈసిటీలో లేడు. వాడు ఒకమృగం. వాడిని చంపే పథకం చాలాకాలంగా పలువురు దాదాలు గూండాలుముందుకు వచ్చినా సక్సెస్ కాలేదు.సరే ఎలా నీవు ఖతమ్ చేయాలనుకుంటున్నావు.ఇలా ఎందుకు అడిగానో తెలుసా?వాడిమీద ఇప్పటికి పలుమార్లు హత్యాప్రయత్నాలు జరిగినా వాడు తృటిలో తప్పించుకుని పోయాడు.నీవు ఎలాంటి పథకంతో ఉన్నావో నాకు తెలిపితే నేను ఆవిధానం వర్కవుట్ అవుతుందో లేదో తెలియపరుస్తాను. నేను చెప్పననుకుంటే నోరు విప్పక్కర్లేదు" రాజ్‌వర్మ చెప్పాడు.

"ఇంత డబ్బు నాకిచ్చిన మీకు చెప్పకుండా సీక్రెట్‌గా ఉంచాల్సింది ఏమీలేదు. సరే, ఇలా ఫోన్‌లో కాదు. నన్ను ఎక్కడికి రమ్మంటారు.నేనే వచ్చి చెబుతాను"

"నేరుగా నాగోల్డుషాపుకు వచ్చేయ్. నాకున్న ఎన్నో వ్యాపారాల్లో ఇదొకటి" ఆగోల్డుషాపు చిరునామా చెప్పాడు.

"ఇక్కడ ఉన్నట్టే అక్కడ ఉంటాను" సెల్‌ఆపేసి టాక్సీ ఎక్కి బయల్దేరాడు.

లతీఫ్ రాజ్‌వర్మను ఒక గోల్డుషాపులో వెనుక గదిలో కలుసుకున్నాడు. ఇద్దరూ ఒకరిని ఒకరు చూసుకున్నారు. రాజ్‌వర్మను చూసి మీరు నిజంగా శేర్ కాదా!?" అని అనుమానంగా అడిగాడు.

రాజ్‌వర్మ నవ్వాడు.లతీఫ్ జేబులోంచి పిస్తోలు తీయబోయాడు. ఆవెంటనే రాజ్‌వర్మ లతీఫ్‌ను గట్టిగాపట్టుకున్నాడు. అప్పటికే మాటువేసిన పోలీసులు అరెస్టుచేసి వాన్ ఎక్కించారు.రాజ్‌వర్మగా తెల్లని దుస్తులు ధరించి శేర్‌లా ఉన్న వ్యక్తి కొత్తగా ఠాణాకు వచ్చిన ఇన్‌స్పెక్టర్ విక్రమ్. వాన్‌లోనే లతీఫ్ చేతికి సంకెళ్లు వేసి తానెవరైంది చెప్పాడు.

"శేర్ రాజ్‌వర్మ మీతో చేతులు కలిపాడా? నా వంటి గూండాను పట్టించడానికి మీతో చేతులు కలిపాడంటే వాడికి నూకలు చెల్లినట్టే" అని కోపంతో పళ్లు కొరికాడు.

విక్రమ్ నాలుగు తన్నులు తన్ని "చుప్‌రే బద్మాష్! నీకోసం కలకత్తా పోలీసులు వెతుకుతున్నారు. నువ్వు ఒక మర్డర్ కేసులో పారిపోయి ఇక్కడికి వచ్చావు. అయితే ఇక్కడ మాకెవ్వరికి నీవెవరవో తెలియదు. అయితే నీమీద అనుమానం ఉన్న ఎవడో అజ్ఞాతవ్యక్తి నిన్ను సెల్‌ఫోన్‌తో ఫోటోతీసి నెట్‌లోపెట్టి ఇక్కడ పోలీసులకు వేగు అందించాడు. నిన్ను ఉన్నపళంగా మూసేసి కూపీ లాగొచ్చు. కానీ, నీవు ఇక్కడ చేసే నిర్వాకం ఏమిటో మాకు తెలియకుండా పోతుంది. నీవుండే మురికివాడ ప్రాంతంలో మా నిఘా ఉండనే ఉంది. మరోవైపు నీగురించి ఆరా తీశాం. నీవు కలకత్తాలో వాంటెడ్‌లో ఉన్నావు. అందుకే ఒక బ్లాంక్ చెక్‌తో వల వేశాం.నీకు కవర్ ఇచ్చిన కొరియర్ వ్యక్తి మా కానిస్టేబులే"

ఆమాటలకు అవాక్కయ్యాడు లతీఫ్. "ఏంటి నాగురించి మురికివాడలో ఉండే వెధవ మీకు వేగు అందించాడా? ఎవడు వాడు?" కోపంగానే అడిగాడు.

"నీవు మద్యం సేవిస్తూ నోటికి వచ్చినట్టు వాగుతుండేవాడివంట.నీవంటే పోలీసులకు హడల్ అనికూశావంట.దాంతో నీవేదో పెద్ద నేరగాడివేనని ఒకఫోటో తీసి నీగురించి మెయిల్‌చేశాడు.ఇక వాడిగురించి నీకెందుకు?"

"నీవు బ్లాంక్‌చెక్‌తో బ్యాంకుకు వెడితే అక్కడ నీతో మేము ఏమిచెప్పమంటే అదే చెప్పాడు ఆ మేనేజర్. ఒకరకంగా భయపడ్డాడు. రెండున్నర లక్షలు క్యాష్ మేనేజర్‌కు ఇచ్చి ఆయన సొరుగులో పెట్టి ఉంచాం. నీవు విత్‌డ్రాచేస్తే కౌంటర్‌లా కాకుండా నేరుగా ఆయనే నిన్ను కూర్చోబెట్టి చెల్లించేలా ఏర్పాటు చేశాం. నీవు విత్‌డ్రా చేయలేదు.ఇంతకీ మేము అనుకున్నట్టే నిన్ను మా వలలోకి ఎలా నెట్టుకు రాగలిగామంటే కేవలం రెండున్నర లక్షలు రూపాయలు నీకు చెక్ రూపంలో ఇవ్వడంతో నీవు ఏకంగా మావలలోకి వచ్చేశావు" అని చెప్పి నవ్వాడు ఇన్‌స్పెక్టర్.

ఆవెంటనే వ్యాపారవేత్త గజేంద్రను చంపమని లతీఫ్‌తో మర్డర్ డీల్ పెట్టుకున్న వారిని అరెస్టుచేశారు.అప్పటికి గజేంద్ర పన్నెండవసారి హత్యా ప్రయత్నం నుంచి తప్పించుకున్నాడు. కలకత్తా పోలీసులు వచ్చి గజేంద్రను అభినందించారు.ఈ లతీఫ్ పథకం వేసాడంటే చచ్చి తీరాల్సిందే. నీవు చాలా అదృష్టవంతుడవు. లతీఫ్ పోలీసువలకు చిక్కడంతో నీకు ప్రాణాపాయం తప్పింది" అనిచెప్పారు. ★

కథా నిలయం
శ్రీకాకుళం

విశాలమైన భారతావనిలో ప్రతి ప్రాంతానికి ఒక ప్రత్యేకత వుంటుంది. స్వాతంత్ర పోరాట కాలంలో భారతీయులు ఏ మూలన వున్నా చైతన్యానికి ప్రతీకలుగా ప్రకాశించారు. సందర్భం స్థలం ఏదైనా ఈ విధమైన గాధలు ఘట్టాలూ మనకు ఉత్తేజం కలిగిస్తూనే వుంటాయి. రాష్ట్రంలోనే సుప్రసిద్ధమైన కోటప్ప కొండ జాతర ఆ విధంగా చాలా ప్రత్యేకత సంతరించుకుంది. శివరాత్రితో ముడిపడి వున్న ఆ పుణ్యక్షేత్రంలో వందేళ్ల కిందట జరిగిన పోరాట ఘట్టాన్ని గుర్తు చేసుకోవడం సమంజసమే గాక ఆసక్తికరంగానూ వుంటుంది.

ప్రభల పండుగలో ప్రభవించిన స్ఫూర్తి

- ప్రమర

కోటప్పకొండ దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధ శైవక్షేత్రంగా వెలుగొందుతున్నది. గుంటూరు జిల్లా నరసరావుపేట పట్టణానికి 11 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవాలయానికి దాదాపు వెయ్యేళ్ల చరిత్ర ఉంది. మహాశివరాత్రిని పురస్కరించుకుని కోటి వేల్పుల కొండ కోటప్పకొండకు రాష్ట్రం నలుమూలల నుండి భక్త జనసందోహం తరలివస్తుంటారు. అంబరాన్ని తాకే ప్రభల సంబరం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. సాంస్కృతిక కళలు, విద్యుత్ కాంతులు, ప్రకృతి అందాలతో ఈ ప్రాంతమంతా నేత్ర పర్వం చేస్తుంది.

కోటప్పకొండ ఆలయం చాలా ప్రాచీనమైంది. చాళుక్యుల కాలంలో ప్రతిష్టించబడినట్టు చెప్పే ఈ అలయం చుట్టూ పురాణ విశ్వాసాలు కూడా చాలా వున్నాయి. దీన్నే త్రికూటేశ్వరాలయం అని పిలుస్తారు. ఇక్కడ కొండల పంక్తి మూడు శిఖరాలుగా వుంటుంది. వాటినే రుద్ర, విష్ణు, బ్రహ్మ శిఖరాలుగా చెబుతుంటారు. ఇందులో చివరి శిఖరంపై శివాలయం వుంటుంది. చాళుక్యుల తర్వాత ఇది వెలమ జమీందారుల పాలనలోకి వచ్చింది. వారు ఆలయానికి వందల ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు. త్రికూటేశ్వరుడన్న మాట ఆచరణలో కోటప్ప కొండగా మారింది. తెలుగు నాట కోటప్ప, కోటమ్మ, కొండయ్య వంటి పేర్లకు ఇదే మూలమైంది. శివారాధనకోసం వచ్చేవారు మార్గమధ్యంలో ఒక గొల్లభామ ఇంటిని చూసి రావడం ప్రత్యేకత. ఆమె శివుడికి ప్రీతిపాత్రురాలని స్థల పురాణం.

కోటప్పకొండ మొదటి నుంచి ప్రభలకు ప్రసిద్ధి. దీన్ని ప్రభల పండుగ అని కూడా పిలుస్తారు. తిరునాళ్ల వేడుకలో అంబరాన్ని అంటుతున్న ప్రభలే ప్రత్యేక ఆకర్షణ. ఆ విధంగా ప్రతి ఏడాది మహాశివరాత్రి నాడు కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల వైభవంగా జరుగుతుంది. పల్నాడు ప్రాంత గ్రామీణ ప్రజలు అత్యంత ప్రతిష్టాత్మకంగా భక్తిశ్రద్ధలతో ఉత్సాహభరితంగా జరుపుకునే ప్రభల పండుగ ఇదే. గ్రామీణ ప్రజలు పోటీతత్వంతో తమ భక్తిని ప్రదర్శించటానికి ప్రభల ఎత్తును ఎంచుకుంటారు. లక్షలు వెచ్చించి నెల రోజుల ముందు నుండే ప్రభల నిర్మాణాలు చేపడతారు. గ్రామపంచాయితీల గౌరవ ప్రతిష్ఠలకు ప్రతీకగా ప్రభల ఎత్తు ఆధారపడి ఉందంటూ గొప్పలు చెప్పుకుంటారు. అందు కోసమని ఎంత కష్టానికైనా సంసిద్ధులౌతారు. ఎడ్లబండిపై 60 అడుగుల ఎత్తులో ప్రభలను నిర్మించి కోటప్పకొండకు తరలిస్తారు. ఈ సంవత్సరం ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు జిల్లా కలెక్టర్ 50 అడుగులకు మించరాదని నియంత్రించారు. దీనివల్ల చిలకలూరిపేట నుండి వచ్చే గ్రామాల వారికి కొంత అసంతృప్తి కలిగింది. విజయవాడ, శ్రీశైలం, హైటెన్షన్ ఎలక్ట్రికల్ లైన్ వల్ల ప్రభలను నియంత్రించవలసి వచ్చింది. ఈ ఎలక్ట్రికల్ లైను ప్రభలను ఎత్తుకు అడ్డంగా మారింది. ప్రభల ఎత్తు 50 అడుగులు మించితే ఈ లైన్‌కు విద్యుత్‌ను నిలుపుదల చేయవలసి వస్తుంది. దానివల్ల మూడు రాష్ట్రాలకు విద్యుత్ నిలిచిపోతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఒక్క రోజు తిరునాళ్ల కోసం మూడు రాష్ట్రాల ప్రజలకు విద్యుత్‌ను ఆపటం సమంజసం కాదనే ఉద్దేశంతో జిల్లా అధికారులు ప్రభల ఎత్తును నియంత్రిస్తూ ఆదేశించాల్సి వచ్చింది.

రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి తరలివస్తున్న భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేస్తారు. నూతనంగా అభిషేక మండపం, పొంగలి షెడ్, డార్మిటరీ హాల్, మండపం చుట్టూ గ్రానైట్ వంటి పనులు చేపట్టి పూర్తిచేశారు. పర్యాటక కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు పొందిన కోటప్పకొండ భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది. ఇక్కడ ఉన్న వనశాల, పక్షుల ఎగ్జిబిషన్, కాళింగ మర్ధనం, రైల్ రేస్, బోట్ షికార్ వంటి వాటిని పర్యాటకుల కోసం సుందరంగా తీర్చిదిద్దారు. దైవ దర్శనం తరువాత మానిసిక ఉల్లాసం కోసం ఈ పార్కులకు భక్తులు వెళుతుంటారు. రూ.5 లక్షల వ్యయంతో దేవాలయానికి ప్రత్యేక ఆకర్షణలుగా 40 అడుగుల త్రిముఖ లింగాకార విగ్రహం, కాళీయమర్ధనం, వినాయక విగ్రహం, నాగేంద్రస్వామి పుట్ట వంటి విగ్రహాలకు రంగులు వేశారు.

ఈ విశ్వాసాలు విశేషాలు పక్కన పెట్టి మళ్లీ చరిత్రలోకి వస్తే కోటప్ప కొండలో సరిగ్గా వందేళ్ల నాడు 1909 ఫిబ్రవరి 18న జరిగిన ఘటన భారత స్వాతంత్ర పోరాట చరిత్రలో చిరస్థాయిగా నిల్చిపోయింది. అది వందేమాతరం వుద్యమం వూపందుకుంటున్న కాలం. నాడు జరిగిన ఘటనలను గురించి

ప్రముఖ స్వాతంత్ర యోధులు కీ.శే. అయ్యదేవర కాళేశ్వరరావు ఇలా రాశారు: 1909 ఫిబ్రవరిలో కోటప్ప కొండ వద్ద జరిగిన శివరాత్రి యుత్సవమునకు అదివరకటేట జరిగినటులే వేలకు వేల ప్రజలు పోగైరి. వారిలో చాలా మంది మంచి మంచి ఎద్దులను బాగుగా నలంకరించి ప్రభలను కట్టుకుని వచ్చిరి. అటులనే చిన్నప్పరెడ్డి యను రెడ్డి నాయకుడు అతని మిత్రులు మంచి ఎద్దులతో గొప్ప ప్రభలను కట్టుకుని వచ్చిరి. పోలీసు హెడ్ కానిస్టేబులు లా అండ్ ఆర్డర్ పేరుతో ప్రభలు కట్టుకుని వచ్చిన వారిమీద అనవసరముగా దౌర్జన్యము చేయుచు త్రోవలు సరిగ్గా వుండవలెనని మనుష్యులను బెత్తములతో కొట్టసాగిరి.అదే విధముగా చిన్నప్పరెడ్డి మీద దౌర్జన్యము చేసి అతని ఎద్దులను కొట్టగా అవి స్వాధీనము తప్పినవి.అందుమీద పోలీసులు తుపాకులు కాల్చి చిన్నప్పరెడ్డి ఎడ్లను చంపినారు. అపుడు చిన్నప్పరెడ్డి అతని మిత్రులు పోలీసుల మీద గొప్ప తిరుగుబాటు చేసినారు. పోలీసులు ప్రజల మీద కాల్చినారు. కొందరు హతులైనారు. ప్రజలందరూ చిన్నపరెడ్డితో చేరినారు.స్త్రీలు కూడా ఇనపకడ్డీలతో పోలీసుల మీదకు పోయినారు. పోలీసు హెడ్ కానిస్టేబులును పట్టుకుని మంటలలో వేసి హత్యకావించినారు. తక్కిన పోలీసు వారు మేజిస్ట్రేటు వారు పారిపోయినారు. ఆ సమయములో వందేమాతరం, బ్రిటిష్ వారిని పారద్రోలండి స్వరాజ్యము కావాలి అనే నినాదాలు నలు దిశల మారుమోగినవి.... చిన్నప్పరెడ్డి గొప్ప ధీరుడైనాడు. తరువాత ఆయనను మరికొందరిని అరెస్టు చేసి ఉరి తీసినారు. మరికొందరికి దీర్ఘ శిక్షలు వేసినారు. అపుడు కెరాషన్సు సబు కలెక్టరుగా నుండెను. రాజినామా ఇచ్చి వెళ్లిపోయినాడు. కొంతరు ఉద్యోగస్తులు పిరికి పందల వలె తమ పనిని సకాలములో నెరవేర్చనందుకు శిక్ష కింద కింది వుద్యోగములలోకి నెట్టబడినారు. ఇది కూడా స్వరాజ్యోద్యమమునకు తోడ్పడినది. చిన్నప్పరెడ్డి మహాధీరుడని పొగిడే ఉద్రేకమైన పాటలు కట్టి పాడుకున్నారు. (సైసై చిన్నప్పరెడ్డి) ఇవి ఇప్పటికి ఆ ప్రాంత ప్రజలచే పాడబడుచున్నవి".

ఈ ఘటనలో అయ్యదేవర ప్రస్తావించిన సబ్ కలెక్టర్ కేర్షాన్స్ గురవాయ పాలెం నుంచి కోటప్ప కొండకు వచ్చాడు. సత్రములో గాయపడి వున్న డివైఎస్‌పి సుబ్బారెడ్డికి కట్లు కడుతుండగా జనం సత్రాన్ని చుట్టు ముట్టారు.డఫేదారును కొట్టారు. అప్పుడే పోలీసులు జరిపిన కాల్పులలో ఇద్దరు మరణించారు.అయినా ప్రజలు భయపడకుండా వందేమాతరం నినాదాలతో దూసుకుపోయి సత్రానికి నిప్పు పెట్టారు. సబ్ కలెక్టర్, డివైఎస్‌పి ఎలాగో ప్రాణాలతో బయిటపడ్డారు. ఒక కానిస్టేబులు, ఒక బంట్రోతు చనిపోయారు.

బ్రిటిష్ ప్రభుత్వం ఇందుకు సంబంధించి 45 మందిని అరెస్టు చేసి కేసు పెట్టింది.వారిలో 21 మందికి శిక్షలు పడ్డాయి.చిన్నప్పరెడ్డికి మరణశిక్ష, మరో నలుగురికి యావజ్జీవ శిక్ష విధించారు.సబ్ కలెక్టర్ కెర్షాన్స్‌ను, డివైఎస్‌పి సుబ్బారెడ్డిని,తహసీల్దారు బ్రహ్మానందం నాయుడును, సుబ్బారాయుడు అనే సబ్ మెజిస్ట్రేట్‌ను డిస్మిస్ చేసింది.

ఈ విధంగా గొప్ప శివ క్షేత్రమైన కోటప్ప కొండ స్వాతంత్ర పోరాట చరిత్రలో స్థానం సంపాదించింది. శివరాత్రి రోజున దైవ భక్తితో పాటు దేశ భక్తిని కూడా చాటుతున్నది.

★

200 ఏళ్ల చరిత్ర కలిగిన తీర్థాల జాతర



మూడు ఏర్లు (అకేరు, మున్నేరు, బగ్గేరు) కలిసే ప్రాంతంలో కొలువైన ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామం వద్ద ఉన్న శివాలయానికి 200 ఏళ్ల చరిత్ర ఉంది. తెలంగాణా ప్రాంతంలోనే అతి పెద్దదైన ఈ దేవాలయానికి ప్రతి సంవత్సరమూ శివరాత్రి సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు తరలివస్తారు. ఈ నెల 23 శివరాత్రి సందర్భంగా జాతర ప్రారంభమై మూడు రోజుల పాటు జరుగుతుంది.

కాకతీయుల కళా వైభవానికి నిదర్శనంగా చెప్పుకునే ఈ దేవాలయం ప్రాంతాన్ని కూడలి అని కూడా పిలుస్తారు. ఖమ్మం పట్టణానికి కేవలం 10 కిలోమీటర్ల దూరంలో తీర్థాల గ్రామం వద్ద త్రివేణి సంగమం ఏటి ఒడ్డున దేవాలయం మొత్తం రాయితో నిర్మించబడింది.

ఈ దేవాలయం తెలంగాణా ప్రాంతానికే తలమానికంగా చెప్పుకుంటారు. సమ్మక్క, సారలమ్మ జాతరల తర్వాత అతిపెద్ద జాతర ఇక్కడ జరుగుతుంది. నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ ప్రాంతాల నుండి ఎక్కువ సంఖ్యలో జనం తరలివస్తారు. ఆర్‌టిసి కూడా ప్రత్యేకంగా బస్సులను మూడు రోజుల పాటు ఇక్కడికి నడుపుతుంది. వైద్యఆరోగ్యశాఖ, రెవెన్యూ, దేవాదాయ, పోలీసు, గ్రామీణ మంచినీటి సరఫరా, విద్యుత్ శాఖలు 15 రోజుల ముందు నుండే ఏర్పాట్లలో నిమగ్నం అవుతాయి. జిల్లా మంత్రులు, ఎంఎల్‌ఏలు, కలెక్టర్, ఎస్‌పిలు, మిగతా శాఖల ఉన్నతాధికారులు ప్రతి సంవత్సరమూ జాతర సమయంలో దేవాలయాన్ని కుటుంబ సమేతంగా సందర్శిస్తారు.

ఆహ్లాద వాతావరణం

మూడు పాయల గుండా వచ్చే నీరు ఒకేచోట కలవటం, ఆ నీటిపై నుండి వీచే గాలి, ఒడ్డున అటవీ ప్రాంతం ప్రత్యేకంగా పెంచిన చెట్లతో కూడిన వనం చూడటానికి ఆహ్లాదకరంగా ఉంటుంది. అన్ని ప్రాంతాల సంస్కృతి, సాంప్రదాయాలు కూడలి జాతరలో కన్పిస్తాయి. చదివిన దానికంటే కళ్లతో చూస్తే లభించే అనుభూతి ఎక్కువ. కూడలి, సంగమం వంటి పేర్లు ఇతర జిల్లాల్లో కూడా వున్నాయి.

దేవాదాయశాఖ పరిధిలోకి

1952 ప్రాంతంలో ఈ దేవాలయాన్ని దేవాదాయ ధర్మాదాయశాఖ తమ పరిధిలోకి తీసుకుంది. అప్పటి నుండి దేవాలయ నిర్వహణకు ప్రత్యేక అధికారితో పాటు ట్రస్టును కూడా నియమించారు. అంతకు ముందు ఎటువంటి రక్షణా లేకుండా ఉన్న దేవాలయం ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మించారు. ప్రత్యేక అధికారికి కార్యాలయం, భక్తుల కోసం జాతర సమయంలో ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు.మూడు ఏర్లు కలిసే ప్రాంతంలో నీట మునిగి స్నానం చేస్తే పాపాలు అన్ని పోతాయనేది భక్తుల నమ్మకం. జాతర సమయంలో స్నానం, దేముడి సందర్శన, తలనీలాలు సమర్పణ లాంటి మొక్కుల కోసం చాలామంది వస్తారు.

లౌకికత్వానికి నిదర్శనం

మూడు రోజుల జాతర లౌకికత్వానికి నిదర్శనంగా ఉంటుంది. అన్ని వర్గాలు, మతాలు, కులాలకు చెందిన వారు జాతరకు వస్తారు. భక్తుల కోసం ఇతర మతాల వారు ప్రత్యేక సౌకర్యాలు స్వంత ఖర్చుతో ఏర్పాటు చేయటం ఆనవాయితీగా వస్తోంది. కులం, మతంతో సంబంధం లేకుండా తీర్థాల సమీప గ్రామాల వారు సమిష్టిగా ఇళ్లు అలకటం, బంధువులను ఆహ్వానించి బట్టలు పెట్టడం లాంటివి చేస్తారు.

- శనగపాటి మురళీకృష్ణ, ఖమ్మం

ఓ మంచి పుస్తకం

అగ్నితరంగం

స్త్రీ విద్య వితంతు పునర్వివాహం కోసం వీరేశలింగం, ఆయన మిత్ర బృందం, శిష్యబృందం సాగించిన మహోద్యమం గురించి స్వీయ చరిత్రలో చదువుతుంటే ఉత్సాహం, ఉత్తేజం ముప్పిరిగొంటాయి. సమాజంలో మార్పుకోసం పోరాడటంలోని సాదక బాదకాలు అవగతమవుతాయి. ఎందరినో కదిలించి వెంట నడిపించుకోగలిగారు గనుకనే ఆయన ఒక సామాజిక శక్తిగా మారగలిగారు. ఛాందసులను, స్వార్థపరులను నైతికంగానే గాక భౌతికంగానూ ఎదుర్కోగలిగారు.

-తె.ర

కొర్యశూరుడు వీరేశలింగం, కదం తొక్కి పోరాడిన సింగం, దురాచారాల దురాగతాలను తుదముట్టించిన అగ్ని తరంగం అని మహాకవి శ్రీశ్రీ ఆయనను అభివర్ణించారు. "కొట్టుకొని పోయె కొన్ని కోటిలింగాలు, వీరేశలింగ మొకడు మిగిలెను చాలు" అని ఆరుద్ర ఆయనకు నివాళలర్పించారు. "ప్రముఖ కాలంలో అగ్రగణ్యుడైన ఆంధ్రుడు" అని కట్టమంచి రామలింగారెడ్డి అంటే "ప్రముఖ భారతీయులలో ఒకడు. లోతైన వివేచన, అంతులేని సాహసము. అమితమైన శక్తి కలవాడు. అసత్యాన్ని చెండాడి ప్రగతి మార్గం కోసం పోరాడాడు" అని రాజాజీ ప్రస్తుతించారు. ఆదర్శ దృక్పథం గల కార్యవాది" అని నార్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆంధ్రలో జీవిత ప్రవాహాన్ని వీరేశలింగం కొత్తదారి పట్టించారు. ఈ కృషిలో ఆయనకు మార్గదర్శకులు లేరు. ఆయనతో పోల్చదగినవారు లేరు" అని కుందూరి ఈశ్వర దత్తు కీర్తించారు. ఇలాంటి వర్ణనలెన్నయినా నవ్యాంధ్ర వైతాళికుడు వీరేశలింగం విరాట్ స్వరూపాన్ని సంపూర్ణంగా చిత్రించలేవు.

ఆయన జన్మించడానికి పాతికేళ్ళముందు వరకు చెదురు మదురుగానైనా సతీసహగమనం వంటి దురాచారం ఇక్కడా ఉండేది. అక్షరాస్యత చాలా తక్కువ. పాత సామాజిక వ్యవస్థ శిధిలమవుతున్నా కూడా కొత్తది రూపం దాల్చలేగు. సంఘజీవనంలో అజ్ఞానం, అనారోగ్యం అంధవిశ్వాసాలు రాజ్యమేలుతున్నాయి. తరచు కరవు కాటకాలు, తుఫానులు, గాలివానలు వంటివి ప్రజల జీవితాన్ని కడగండ్లపాలు చేస్తున్నాయి. వాన కురిస్తేనే పంట. ప్రయాణ సాధనాలు లేవు. సంస్థానాధీశులు, జమీందారుల భోగవిలాసాలు. బ్రిటిష్ పాలకుల సాయంతో పెత్తనం, విత్తం సంపాదించుకున్న కొత్త కులీనవర్గం. లంచగొండితనం. విద్యా విధానం, ప్రయాణ సాధనాలు నామమాత్రం. ఇలాంటి స్థితిలో ప్రజల అజ్ఞానం, భయభీతులు, దైన్యం వగైరాలను ఆసరా చేసుకుని క్షుద్రశక్తులు, మూఢనమ్మకాలు వెర్రితలలు వేస్తున్న దశ. వీటికి అందరికంటే ఎక్కువగా బలైనవారు స్త్రీలు. అందులోనూ బాలవితంతువులు! 1901లో దేశంలో పాతికేళ్లలోపు బాల వితంతువులు 12 లక్షల మంది వున్నట్లు జనాభాలెక్కలు చెప్పాయి. ఆడపిల్లలు చదువుకోకూడదు. వారికి లోకజ్ఞానం ఉండకూడదు. బాల్యవివాహాలు. పురుషులకు నాలుగైదు పెళ్లిళ్లు. బాల వితంతువులు మాత్రం గొడ్డు చాకిరీలోనే జీవితం చాలించాలి.

ఇలాంటి పరిస్థితిలో పుట్టి వాటిని మార్చడానికి నడుంకట్టి దేశానికే ఆదర్శం చూపిన ధీశాలి కందుకూరి తన జీవితానుభవాలను, అభిప్రాయాలను స్వీయచరిత్ర'గా గ్రంథస్తం చేయడం తెలుగువారి మహద్భాగ్యం.

"తెలుగులో మొదటి ప్రబంధమును నేనే చేసితిని, మొదటి నాటకమును నేనే తెనుగించితిని. మొదటి ప్రకృతి శాస్త్రమును నేనే రచించితిని. మొదటి ప్రహసనము నేనే వ్రాసితిని. మొదటి చరిత్రమును నేనే విరచించితిని. స్త్రీలకై మొదటి వచన పుస్తకమును నేనే కావించితిని" అంటూ స్వీయ చరిత్రలో రాసుకున్న కందుకూరి ఆ ప్రక్రియకు కూడా ఆద్యులు అనడం అక్షర సత్యం. నిజానికి పంతులుగారికీ స్వీయచరిత్ర రాసుకోవడం పెద్దగా ఇష్టంలేదు.అయితే ఆయనకంటే చిన్నవాడే అయిన గవర్రాజు దురదృష్టవశాత్తు అకాలమరణం చెందారు. అప్పుడు పంతులుగారే గవర్రాజు జీవిత చరిత్ర రాయాల్సి వచ్చింది. ఆ క్రమంలో స్వీయ చరిత్రకు శ్రీకారం చుట్టినట్లయింది. ఈలోగా అభిమానులు తమకు తోచినట్టు రాయటం మొదలు పెట్టారు. దాంతో ఆయనే 1903లో ఆత్మకథ రాసుకోవడం మొదలైంది. రెండు భాగాలుగా పూర్తిచేశారు. 1911లో మొదటి భాగం అచ్చయ్యేలోగా సహధర్మచారిణి రాజ్యలక్ష్మమ్మగారు కన్నుమూశారు. జీవితాంతం అన్ని మలుపుల్లో మహత్కార్యాల్లో తనతో నిలిచిన భార్య మరణం ఆయనను ఎంతో కృంగదీసింది. ఏబది సంవత్సరముల కాలము ప్రాణమునకు ప్రాణమైయుండిన నాయర్ధాంగి లక్ష్మియైన రాజ్యలక్ష్మికి దీనిని నేనంకితము చేయుచున్నాడనని ఆయన రాశారు. అదృష్ట వశాత్తూ ఆ అంకిత వాక్యాలు చాలా సంవత్సరాలకు బయటపడి 1982లో ప్రచురించిన స్వీయ చరిత్ర ముద్రణలో చోటుచేసుకున్నాయి.

విశాలాంధ్రవారు అక్కిరాజు రమాపతిరావు సంపాదకత్వంలో అధోజ్ఞాపికలు, వివరాలతో సహా స్వీయచరిత్ర సంపూర్ణ పాఠం పునర్ముద్రించారు. గోదావరి తీరంలోని రాజమహేంద్రవరం తరతరాల చరిత్రకు సాక్షీభూతమైంది. కళా సాహిత్యాలనూ ప్రవహింపచేసింది. ఆంధ్రమహాభారతానికి అక్కడే అంకురార్పణ జరిగింది. అలాంటి చోటు కందుకూరి వీరేశలింగం సంస్కార క్షేత్రం కావడం యాదృచ్ఛికమేమీ కాదు. తాతగారి పేరు కూడా వీరేశలింగమే. గొప్ప వ్యవహర్త. ఎన్నో ఉన్నతోద్యోగాలు నిర్వహించిన వ్యక్తి. రాజమండ్రిలో లంకంత ఇల్లు కట్టాడు. వీరశైవుడైనప్పటికీ మెడలో లింగాకృతులు కట్టుకోకుండా కొద్దిపాటి సంస్కరణ దృష్టి ప్రదర్శించినవాడు ఆయన. రెండో కొడుకు సుబ్బారాయుడుకు -పున్నమ్మకు 1848లో ఏప్రిల్ 16న పుట్టిన బిడ్డే వీరేశలింగం. పుట్టినప్పటి నుంచి జబ్బులు ఆయనను వెన్నాడాయట. ప్రాణాలు పోతాయని దాదాపు బయటపెట్టిన సందర్భాలూ వున్నాయి. అయినా మృతాచారాలను తుదముట్టించే కర్తవ్య నిర్వహణకు ఆయన మృత్యుంజయుడై బయట పడ్డారు! జీవితాంతం సాంఘిక దురాచారాలతోనే గాక శారీరక రుగ్మతలతోనూ పోరాడుతూ వచ్చారు. నాలుగో ఏటనే తండ్రిని కోల్పోయి పెత్తండ్రి సాయంతో తల్లినీడలో పెరిగాడు. చిన్నప్పుడే పాఠాలు, శతకాలు బాగా

వంటపట్టించుకొన్నాడు. అన్నట్లు ఆరోజుల్లోనే తమ పంతులుగారిని అనుకరించి, ముక్కుతో మాట్లాడటం నేర్చుకున్నాడు. ఈ దురలవాటు జీవితాంతం తనను వదిలిపెట్టలేదని ఆత్మకథలో వాపోయారు. వసు చరిత్ర చదవాలనే కుతూహలంతో ఆయన పుస్తకాల షాపు యజమానితో ఒక ఒప్పందం కుదుర్చుకుంటాడు. తల్లి స్కూల్ ఫీజు కోసం ఇచ్చే డబ్బు ఆయనకు ఇస్తే ధర పూర్తిగా చెల్లించే వరకు అక్కడే వుండి చదువుకోవడం ఆ ఒప్పందం సారాంశం. కొడుకు బడి మానేసి అలా చదువుకుంటున్న విషయం ఎలాగో తల్లికి తెలిసింది. ఆయన పఠనాభిలాషకు సంతోషించి, పుస్తకం కొని పెట్టింది. ఏకసంథాగ్రాహి కావడంతో ఆయనకు త్వరగా వచ్చేవి. అయితే ఆ లక్షణమే తనను కొంత చెడగొట్టిందని ఆయన రాసుకున్నారు. ప్రతిభ వుందని మరింత కష్టపడకుండా వుండేవారికంటే ఎక్కువగా కష్టపడేవారే లోకానికి మేలు చేస్తారని అంటారు. విద్యార్థి దశలో ఆయన అసమర్థుడైన ప్రధానోపాధ్యాయునికి వ్యతిరేకంగా పోరాడి వెనక్కు పంపించారు. అదే సమయంలో చదువులో ప్రతిసారి ప్రథములుగా వచ్చి అనేక ప్రశంసలు, సహాయాలు అందుకున్నారు.

జ్యోతిష్యాలు ముహూర్తాలపై, భూతవైద్యులు, దయ్యాలపైన ఆయన మొదటే విశ్వాసం పోగొట్టుకుని, అవన్నీ బూటకమని గ్రహించారు. బ్రహ్మసమాజ ఆచార్యత్రయంలో ముఖ్యులైన కేశవ చంద్రసేన్ రచనలు వీరేశలింగంగారిలో కొత్త ఆలోచనలు రేకెత్తించాయి. మిత్రులతో కలిసి సమావేశాలు జరుపుతూ నూతన విషయాలను చర్చించడం మొదలు పెట్టారు. వాళ్లు వీధిలో వెళ్తోంటే 'మీటింగుల వాళ్లు వీళ్లేనర్రో' అని మూఢులు తమలో తాము చెప్పుకునే వారట! కొన్నాళ్లు న్యాయవాదుల దగ్గర పనిచేసిన తర్వాత ఆయనకు ఆవృత్తిపై వైముఖ్యమేర్పడింది. స్వతంత్రంగా జీవించాలని, లేదా ఉపాధ్యాయుడుగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. అలాగే పత్రికా రచన కూడా మొదలు పెట్టారు. మద్రాసు నుంచి కొక్కొండ వెంకటరత్నం పంతులు ప్రచురించే పత్రికలో స్త్రీవిద్యకు వ్యతిరేకంగా రాసేవారు. దాన్ని ఖండిస్తూ ఆయన బందరునుంచి వెలువడే "పురుషార్థ ప్రదాయని"లో వ్యాసాలు రాయసాగారు. ఆ తర్వాత 1974లో తీనే 'వివేకవర్ధని' పేరుతో మాసపత్రిక ప్రారంభించారు. దానికి అనుబంధంగా "హాస్య సంజీవిని" ప్రారంభించారు. తనపైన తన రచనలపైనా ఛాందసులు చేసే విమర్శలను ఎదుర్కోవడానికి, సాంఘిక దురాచారాలను ఖండించడానికి ఆయన దాన్ని సాధనంగా చేసుకున్నారు. "పెద్దయ్యగారి పెళ్లి" అని పామరులు చెప్పుకున్న "బ్రహ్మ వివాహము" ప్రహసనము ఈ పత్రికలోనే మొదట వెలువడింది. ఆనాటి న్యాయవాదులు, న్యాయమూర్తుల అవినీతి పనులను, వేశ్యావృత్తిని పోషించే దురాచారాన్ని శక్తివంతంగా ఖండించడానికి ఆయన తన పత్రికలను ఆయుధాలుగా వినియోగించారు. ఈ క్రమంలో ఎందరినో ఎదుర్కొన్నారు. ఈనాడు ఎంతగానో చెప్పుకునే పరిశోధనాత్మక జర్నలిజంకు వరవడి పెట్టారు. పరువు పోయిన కామరాజు ఆత్మహత్య చేసుకోగా, మునసబుకు మతి చలించింది. ప్రభుత్వోద్యోగులు, ప్లీడర్లు కపట స్వాములు వేశ్యాగృహనిర్వాహకులు ఆయనను, ఆ పత్రికను తిట్టిపోశారు. అది ప్రజల ఆదరణతో 1876లో పక్ష పత్రికగా మారింది. ఆనాటి ఇంగ్లీష్ అధికారులకు అర్థంకావడం కోసం ఇంగ్లీష్ విభాగం కూడా వుండేది.

వీరేశలింగంగారి ఉద్యమ రథానికి రెండు చక్రాలు ఒకటి సాహిత్యం, రెండోది సంఘసంస్కరణ. సాహిత్యకారుడుగా ఆయన కృషి అసాధారణమైంది. అందులోనూ అంతటి కార్యశీలిగా వుంటూ అన్ని రచనలు చేయడం ఆయనకే చెల్లింది. 1899లో గోల్డ్ స్మిత్ నవల "వికార్ ఆఫ్ వేక్‌ఫీల్డ్" ఆధారంగా 'రాజశేఖర చరిత్ర' అనే తొలి తెలుగు నవల రాశారు. దేవుళ్లు, రాజులను గాక మానవుణ్ణి కథానాయకుడుగా తీసుకున్నారు. మొత్తంపై ఆయన రచనలు వందకు పైనే వుంటాయి. కొత్త గ్రంథాలు రాయడమేగాక, పాతవి పరిష్కరించి ప్రచురించారు. వ్యాకరణం రాశారు. ఆఖరుకు వైజ్ఞానిక దృష్టితో జీవశాస్త్రం, ప్రకృతిశాస్త్రం, వంటివి తెలుగులోకి తీసుకువచ్చారు. అందుకోసం ఆ రోజుల్లోనే జంతువులు, మానవుల శరీర భాగాలను క్షుణ్ణంగా తెలుసుకోవడానికి ప్రయత్నించారు. తెలుగులో తొలిసారి సమగ్రంగా కవుల చరిత్ర రాశారు. 1883లో స్త్రీల కోసం ప్రత్యేకంగా 'సతీహితబోధిని' అనే పత్రిక నడిపారు.

స్త్రీ విద్య వితంతు పునర్వివాహం కోసం వీరేశలింగం, ఆయన మిత్ర బృందం, శిష్యబృందం సాగించిన మహోద్యమం గురించి స్వీయ చరిత్రలో చదువుతుంటే ఉత్సాహం, ఉత్తేజం ముప్పిరిగొంటాయి. సమాజంలో మార్పుకోసం పోరాడటంలోని సాధక బాధకాలు అవగతమవుతాయి. ఎందరినో కదిలించి వెంట నడిపించుకోగలిగారు గనుకనే ఆయన ఒక సామాజిక శక్తిగా మారగలిగారు. ఛాందసులను, స్వార్థపరులను నైతికంగానే గాక భౌతికంగానూ ఎదుర్కోగలిగారు.

1881 డిసెంబర్ 11న ఆంధ్రదేశంలో తొలి వితంతు పునర్వివాహం రాజమండ్రిలో జరిగింది. కృష్ణాజిల్లాకు చెందిన గౌరమ్మను వీరేశలింగం సన్నిహితులైన గోగులపాటి శ్రీరాములు రాజమండ్రిలో పెళ్లి చేసుకున్నారు. నిజానికిది వివాహం కాదు. పెద్ద సాంఘిక సంగ్రామం. ఒక కురుక్షేత్రం. ఆనాటి నుంచి ఎన్నో అవరోధాలు ఎదురైనా వీరేశలింగం వెనకంజ వేయలేదు.

ఎక్కడెక్కడి వితంతువులకు ఆ పుణ్య దంపతులే ఆశ్రయమిచ్చారు. విద్యా, వైద్యం కల్పించి పెళ్లిళ్ళు చేయడమే గాక కొత్త జంటలకు కొంత భృతి కూడా కల్పించారు. తనమీద గౌరవం గల దాతల ద్వారానూ, తాను స్వయంగానూ వీరేశలింగం గారు పెద్దపెద్ద మొత్తాలు ఇందుకు వెచ్చించారు. ఆశ్రమాలు, విద్యాసంస్థలు కట్టించారు. కాలక్రమంలో కొందరు మిత్రులు శత్రువులైనా, సహాయం పొందినవారే కృతఘ్నులుగా మారినా, అనారోగ్యం వెంటాడినా ఆయన నిస్పృహ చెందలేదు. అసహాయ శూరునిగా, అవిశ్రాంత యోధునిగా ముందుకు సాగారు. అందరి మన్ననలు పొందారు. తెలుగుదేశంలోనే కాదు, దక్షిణ భారతమంతటా ఖ్యాతిగాంచారు. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ అందుకు అభినందన సందేశం పంపించారు. సుబ్రహ్మణ్య భారతి ఆయనను పాత్రగా పెట్టి నవల రాశారు.

సాహిత్యం సంస్కరణలతో పాటు ఇతర విషయాల్లోనూ ఆయన దూరదృష్టి కనపరిచారు. గ్రంథాలయాలు నెలకొల్పారు. పురపాలక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పురమందిరం పేరు మీద టౌన్‌హాల్ కట్టించారు. ఇందుకు సంబంధించిన జమా ఖర్చులు కూడా కచ్చితంగా రాసిపెట్టడం విశేషం.

స్వీయచరిత్రలో అడుగడుగునా ఆయన కార్యశీలత, వినమ్రత గమనిస్తాము. జాతీయ కాంగ్రెస్ స్థాపనకు ఆయన ప్రతిస్పందన కూడా కనిపిస్తుంది. అయితే ఆ కాలం నాటికి జాతీయోద్యమం ఇంకా విస్తరించలేదు. రాజ్యాంగ స్వాతంత్ర్యం కోసం పోరాడటం కంటే సంఘ సంస్కరణ, ఇంకా విస్తరించలేదు. రాజ్యాంగ స్వాతంత్ర్యం కోసం పోరాడటం కంటే సంఘ సంస్కరణ, సంస్కారాలు ముఖ్యమని ఆయన తలపోశారు. ఈ దృష్టి ఇంకా చాలామంది సంస్కర్తలలో కనిపిస్తుంది. అన్ని విషయాల్లో అభివృద్ధి రావాలి గాని కేవలం రాజ్యాంగ సంస్కారం చాలదని ఆయన నొక్కి చెబుతారు. ఇంగ్లీషు వారి ప్రభావం వల్ల కలిగిన చైతన్యాన్ని సత్ఫలితాలను వివరిస్తారు. అయితే సంఘ సంస్కరణ లేని స్వాతంత్ర్యం నిష్ప్రయోజనమనేది ఆయన ప్రధాన దృష్టి. "సాంఘిక సంస్కారములందు మనవారికి మాటలలోగల శూరత్వము కార్యములలోనింకను నేనభిలషించినంత కనబడుటలేదు. మన సంఘ స్థితి బాగుపడినగాని ప్రభుత్వమే వారనుగ్రహించు స్వాతంత్ర్య ఫలములను మనము నిర్విచారముగా ననుభవింపజాలము" అని ఆయన స్వీయచరిత్ర చివర విన్నపము పేర రాశారు. నేటికీ కొనసాగుతున్న కులమతతత్వాలు ఛాందసాలు, జ్యోతిషశాస్త్రం తదితర శాస్త్రాల పేరిట అంధ విశ్వాసాలు గమనిస్తే ఆయన ఆవేదనలోని వాస్తవికత ఎవరైనా అర్థం చేసుకోగలుగుతారు. భూతవైద్యుణ్ణి సవాలు చేసి రాత్రి శ్మశానంలో కాపు వేసి దయ్యాలు లేవని నిరూపించిన వీరేశలింగం పుట్టిన గడ్డమీదనే ఆ తర్వాత వందేళ్ళకు క్షుద్ర శక్తుల గురించి నవలలు ప్రచారం పొందడం ఎంత దురదృష్టకరం? మూఢనమ్మకాలతో ఇంట్లో అరటిచెట్లు నరికివేయమంటే నిరాకరించి ఎదురు నిలిచిన ఆయన పుట్టిన చోటనే వాస్తు పేరిట అనేకమంది కుహనా పండితులు అనవసరమైన పనులు చేయించడం ఎంత విచారకరం? ఆ యుగకర్త జ్ఞాపకాలు మరోసారి కర్తవ్యోద్దీపకాలైతే, జడలు విప్పి ఆడుతున్న మతోన్మాదాన్ని ఆధునికత చాటున పెరుగుతున్న అంధ విశ్వాసాలను దృఢంగా ఎదుర్కోగలుతాము.

★

పండిట్ గంగారాం -3

బీర్బల్ కథలు

ఒకేలా ఉన్నవేంటో...

హలో ఫ్రెండ్స్... ఇక్కడ కనిపిస్తున్న ఆరు బొమ్మల్లో రెండు బొమ్మలు ఒకేలా ఉంటాయి. అవేంటో చెప్పండి.

కార్టూన్



పక్షులకు కళ్లజోడు అవసరం లేదు. ఎందుకంటే వాటికి కంటి జబ్బులేమీ ఉండవుగా!

దారి కనిపెడదాం



జవాబులు

ఒకేలా ఉన్నవేంటో...: 2, 7.

తేడాలు :1. పిల్లి నోరు, 2.అమ్మాయి తలపై టోపీ, 3.కూల్‌డ్రింక్ చుక్కలు, 4.కూల్ డ్రింక్ బాటిల్, 5.ఎలుక తోక, 6. కాకి పక్కన వున్న పొడవాటి బండ.

సుడోకు:

6	1	2	4	5	3
4	3	5	6	1	2
5	2	6	1	3	4
3	4	1	2	6	5
1	5	4	3	2	6
2	6	3	5	4	1

సుడోకు చేస్తారా?

హలో బుజ్జాయిలూ...మీరు లెక్కలు బాగా చేస్తారు కదా. కిందున్న సుడోకు పజిల్‌ను చకచకా చేయండి. మీరు ఏంచేయాలంటే దానిలో నిలువుగా, అడ్డంగా గడులున్నాయిగా. వాటిలో ఒకటి నుండి ఆరు వరకు అంకెలు వేయండి . అయితే ప్రతి వరుసలోనూ ఒక అంకెను ఒక సారి మాత్రమే వాడాలి. తర్వాత మా జవాబుతో సరి చూసుకోండే.

		2	4		
4					2
	2			3	
	4			6	
1					6
		3	5		

తేడాలేంటబ్బా...



నేస్తాలూ ! పై రెండు బొమ్మలూ చూడ్డానికి ఒకేలా ఉన్నా ఆరు తేడాలున్నాయి. అవేంటో గుర్తించండి చూద్దాం. అయితే తరువాత మా జవాబులతో సరిపోల్చుకోండే!

చిన్నారి చిత్రకారులు

ఆర్. మోహన్,
9వ తరగతి,
ఎల్.హెచ్ స్కూల్,
యడ్లపాడు గ్రామం, గుంటూరు.

ఒ.మధు,
9వ తరగతి,
జడ్.పి.హెచ్. స్కూల్,
గంభీరావు పేట, కరీంనగర్.

కె. మోహన్ కుమార్,
10వ తరగతి,
గాంధీనగర్,
హైదరాబాద్.

సృష్టివాదం నుండి పరిణామ వాదం వరకు...

డార్విన్ పరిణామ కథ



పరిణామ వాద సిద్ధాంతకర్త చార్లెస్ డార్విన్‌కు సంబంధించి ఈ ఏడాది రెండు ప్రత్యేకతలున్నాయి. మొదటిది ఆయన జన్మించి ఈ నెల 12కు 200 సంవత్సరాలైంది. రెండోది ఆయన జీవపరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ వెలువరించిన "జాతుల పుట్టుక" (ఆరిజన్ ఆఫ్ స్పిషీస్) గ్రంథం ప్రచురించబడి ఈ ఏడాది నవంబర్ 22కు 150 ఏళ్లు అవుతుంది. నిజానికి డార్విన్ ప్రతిపాదించింది ఒక సిద్ధాంతం కాదు. ఒక ఆలోచనా విధానం. జీవుల పుట్టుక, అభివృద్ధికి సంబంధించిన ఒక శాస్త్రీయమైన ఆలోచనా విధానం. దాన్నే పరిణామ వాదం అంటున్నాం. నిజానికి డార్విన్ తన సిద్ధాంత గ్రంథం 'జాతులు పుట్టుక'లో ఎక్కడా 'పరిణామం' అనే మాట వాడలేదు. దానికి ఆనాటి సామాజిక పరిస్థితులు కారణం. ప్రపంచ వ్యాపితంగా ఈ ఏడాదిని డార్విన్ సంవత్సరంగా, పరిణామ సిద్ధాంత సంవత్సరంగా జరుపుకుంటున్న సందర్భంగా డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంతమేమిటో, ఆ సిద్ధాంతం ప్రతిపాదించనప్పటి పరిస్థితులు ఆయనలో తెచ్చిన మార్పులేమిటో తెలుసుకుందాం!

- ఎస్. వెంకట్రావు

మనం, మన చుట్టూ ఉండే ప్రకృతిలోని జంతు వృక్ష సముదాయాలు ఎక్కడి నుండి వచ్చాయి? నిత్య జీవితంలో మనకు ఈ ప్రశ్న ఎప్పుడో ఒకప్పుడు ఎదురవకుండా ఉండదు. ఈ ప్రశ్న ప్రాచీన కాలం నుండి మనిషిని వేధిస్తూ వస్తోంది. దీనికి మానవుడు తరతరాలుగా రకరకాల సమాధానాలు చెప్పాడు. ఈ సమాధానాలన్నింటినీ స్థూలంగా రెండు రకాలుగా విభజించవచ్చు. ఈ అనంతవిశ్వమూ, అందులోని గ్రహ నక్షత్రాదులూ, భూమీ, భూమిమీద సకల జీవరాసులూ - దీన్నంతటినీ ఒక మానవాతీతమైన అలౌకిక శక్తి సృష్టించి నడుపుతోందన్నది ఒక రకం సమాధానాల సారాంశం. ఆ అలౌకిక శక్తిని దేవుడన్నారు. దేవుడు తన సంకల్పంతో భూమి మీద జీవులను సృష్టిస్తున్నాడు. పోతమట్టిలాంటి పదార్థంలోకి దేవుడు "ఆత్మను" లేదా "జీవశక్తి"ని ప్రవేశపెట్టడం వల్ల జీవులు ఉద్భవిస్తున్నాయి. ఈ వాదం "సృష్టివాదం"గా స్థిరపడింది.

ఇక రెండో రకం వాదన ఉంది. దాని ప్రకారం పదార్థంలోని చలనశీలత అనేది ఈ సకల సృష్టికి కారణం. పదార్థం నిరంతరం చలిస్తుంది. ఈ చలనం వల్ల అది నిరంతరం మారుతూ వుంటుంది. మార్పు క్రమపద్ధతిలో నిరంతరాయంగా సాగిపోతూ వుంటుంది. ఇలా పదార్థం క్రమ వికాస పరిణామం చెందేటప్పుడు అది రకరకాల లక్షణాలు, రూపాలు సంతరించు కుంటుంది. అదే ఈ జగతీ, జీవులు కూడా. దీన్ని "పరిణామ వాదం" అంటున్నారు.

సృష్టివాదం, పరిణామ వాదం.....ఈ రెండు ఎవరో ఒకరు, ఎప్పుడో ఒకసారి చేసినవి కావు. ప్రకృతిని పరిశీలించడం ప్రారంభించినప్పటి నుండి మానవులకు జీవోత్పత్తి ఎలా జరిగింది అనే చిక్కుముడి ఎదురవుతూ వస్తోంది. దాన్ని విప్పడానికి ప్రయత్నించడంలో ఈ రెండు రకాల వాదనలూ బయలుదేరాయి. సృష్టి వాదం ప్రాచీన కాలం నుండి మత గ్రంథాలద్వారా చెప్పబడుతూ వస్తుండగా పరిణామ వాదం కూడా అంతే ప్రాచీన కాలం నుండి అనేక రూపాల్లో వ్యక్తమవుతూ ఉంది.

జీవ జాతులు క్రమ వికాస పరిణామ ఫలితంగా ఏర్పడ్డాయని మొట్టమొదటిసారిగా శాస్త్రీయంగా వివరించిన వ్యక్తి ఛార్లెస్ డార్విన్ అనే బ్రిటిష్ శాస్త్రవేత్త. డార్విన్‌కు ముందునుండీ పరిణామం ద్వారా జీవజాతులు ఆవిర్భవించాయనే వాదం శాస్త్ర ప్రపంచంలో కొనసాగుతూనే వుంది. అయితే ఆ పరిణామం ఎలా జరిగింది అనే దానికి ఎవరూ సరైన వివరణ ఇవ్వలేకపోయారు. మొట్టమొదటిసారి ఈ ప్రయత్నంలో లామార్క్ (1774-1829) అనే ఫ్రెంచ్ శాస్త్రవేత్త ఒకడుగు ముందుకు వేశాడు. జీవులు పరిసరాలలోని మార్పులకు అనుగుణంగా మారతాయని లామార్క్ చెప్పాడు. అలా మార్పు చెందిన జీవి తనకు సంక్రమించిన కొత్త లక్షణాలను తన సంతానానికి అందిస్తుంది. సంతానం పెరిగి పెద్దయ్యేటప్పుడు వాటికి సంక్రమించే కొత్త లక్షణాలు మళ్ళీ వాటి సంతతికి అందుతాయి. ఇలా తరాలు

గడిచేకొద్దీ జీవులు మార్పు చెందుతూ వుంటాయని ఆయన చెప్పాడు. లామార్క్ చెప్పిన ఈ సిద్ధాంతాన్ని ఆర్జిత లక్షణాల వారసత్వ సిద్ధాంతం (థియరీ ఆఫ్ ఎక్వయర్డ్ క్యారక్టర్స్) అని అంటారు. ఆయన తన సిద్ధాంతానికి కొన్ని ఉదాహరణలు చెప్పాడు. అడవుల్లో నివసించే జిరాఫీలకు ఒకప్పుడు గుర్రాలకూ, గాడిదలకూ ఉన్నట్లే పొట్టి మెడలువుండేవి. అవి చెట్ల ఆకులు తిని బ్రతికేవి. క్రమంగా చెట్లక్రింద కొమ్మలకు ఆకులు అంతరించి పోవడంతో అవి మెడా, కాళ్ళూ చాచి మరింత పైనున్న కొమ్మల ఆకులు అందుకునేవి. ఆ విధంగా వాటి మెడా కాళ్ళూ కొద్దిగా సాగాయి. ఆ లక్షణం వాటి సంతానానికి సంక్రమించింది. ఇలా తరాలు గడిచేకొద్దీ జిరాఫీ మెడ, కాళ్ళూ పొడుగైపోయాయని లామార్క్ వాదం.

లామార్క్ పరిణామవాద నిరూపణకు చాలా దగ్గరగా వచ్చి పప్పులో కాలేశాడు. పొట్టి మెడవున్న జీవుల నుండీ క్రమ పరిణామం ద్వారా పొడుగు మెడగల జిరాఫీలు ఆవిర్భవించాయన్నమాట నిజమే. కాని ఆర్జిత లక్షణాల వారసత్వంవల్ల మాత్రంకాదని తరువాత నిరూపణ అయింది. ఈ విషయాన్ని వైజ్‌మాన్ అనే శాస్త్రజ్ఞుడు తేల్చేశాడు. ఆయన ఆడ, మగ చుంచెలుకలకు తోకలు కోశాడు. వాటి మధ్య సంపర్కం ద్వారా పుట్టిన పిల్లలకు తోకలు మామూలుగానే వున్నాయి. వాటికి మళ్ళీ తోకలు కోసి సంపర్కం చేయించాడు. వాటి పిల్లలకు కూడా తోకలు మామూలుగానే వచ్చాయి. ఇలా 20 తరాలు చేసినా చుంచుపిల్లలకు తోకలు మామూలుగానే ఉంటూవచ్చాయి. ఈ విధంగా లామార్క్ వాదం తప్పని తేలిపోయింది. మరి జీవపరిణామం ఎలా జరిగింది? ఈ సమస్యను చార్లెస్ డార్విన్ దాదాపు శాశ్వతంగా పరిష్కరించాడు.

డార్విన్ సిద్ధాంతం సరైందని తరువాత పరిశోధనలు రుజువు చేశాయి. డార్విన్ జీవ పరిణామ వాదాన్ని ప్రవేశపెట్టిన తర్వాత జీవ శాస్త్రం ఎంతో అభివృద్ధి చెందింది. శాఖోపశాఖలుగా విస్తరించింది. ఆధునిక జీవశాస్త్రంలోని దాదాపు అన్ని శాఖలూ పరిణామవాదం సరైందని చెబుతున్నాయి. పరిణామవాదానికి తిరుగులేని నిదర్శనాలు సమకూరుస్తున్నాయి.

ఇప్పటివరకు మనం డార్విన్ చెప్పిన పరిణామం కథ చెప్పుకున్నాం. ఇప్పుడు మనం డార్విన్ పరిణామ కథను గురించి కూడా తెలుసుకోవాలి. ఎందుకంటే "జీవ సృష్టి"వాదంపై ఆధారపడిన బైబిల్‌ను ఔపోసన పట్టడం కోసం ఉన్నత చదువులు ప్రారంభించిన డార్విన్ తనే క్రమంగా పరిణామం చెంది సృష్టివాదాన్ని తిరస్కరించే కొత్త వాదానికి జన్మనిచ్చాడు. సృష్టివాదం నుండి

పరిణామవాదం వరకు భావపరిణామాన్ని అర్థం చేసుకోవాలంటే డార్విన్ పరిశోధనా కాలంనాటి పరిస్థితులు, ఆయన పరిశోధనా క్రమం గురించి కొంత తెలుసుకోవాలి.

డార్విన్ పరిశోధనా క్రమం

చార్లెస్ డార్విన్ (1809-1882) ఇంగ్లాండులోని ష్రూస్‌బరీలో జన్మించాడు. తాత ఎరాస్మస్ డార్విన్ గొప్ప శాస్త్రవేత్త. తండ్రి రాబర్ట్ డార్విన్ పేరున్న వైద్యులు. తల్లి సుసానా తరపువారు జమిందారీ వంశానికి చెందినవారు. చిన్నప్పటి నుండి ఆయనకు ప్రకృతి పరిశీలన అంటే అమితాసక్తి. తనలాగే తన కుమారుడు కూడా వైద్యుడు కావాలన్నది తండ్రి కోర్కె. కాని డార్విన్‌కు వైద్య విద్యపై శ్రద్ధలేకపోవడం గమనించిన తండ్రి ఆయనను ఒక మతబోధకునిగా శిక్షణనిచ్చేందుకు కేంబ్రిడ్జి లోని క్రీస్తు కళాశాలలో చేర్చాడు. అక్కడ కొంతకాలం కీటకాల అధ్యయనం చేశాడు. వృక్షశాస్త్ర ఆచార్యుడు జాన్ స్టీవెన్స్ హెన్‌స్లో తదితర జీవశాస్త్రవేత్తలను కలుసుకున్నాడు. వీరంతా ప్రకృతి మతధర్మశాస్త్రంపై పరిశోధనలు చేశారు. విలియమ్ పాలే రాసిన 'క్రైస్తవానికి నిరూపణలు" గ్రంథంలోని భాష, తర్కం డార్విన్‌ను అమితంగా ఆకర్షించాయి. కేంబ్రిడ్జిలో పరీక్షల తరువాత కూడా డార్విన్ పాలే ప్రతిపాదించిన 'ప్రకృతి మతధర్మశాస్త్రం' అధ్యయనం చేశాడు. ప్రకృతికి సంబంధించిన దైవ సృష్టి నమూనా గురించి ఈ గ్రంథం వివరిస్తుంది. ప్రకృతి సూత్రాల ద్వారా దేవుడు పనిచేస్తాడని ప్రకృతికి

డార్విన్ సిద్ధాంతం క్లుప్తంగా ...

ప్రతి జీవజాతి క్రమవికాస పరిణామ ఫలితంగా ఏర్పడిందే. ఏ జీవజాతి అయినా దాని మానాన దాన్ని వదిలేస్తే అమిత సంతానాన్ని ఉత్పత్తి చేస్తూ పోతుంది. ఉదాహరణకు "సముద్ర నక్షత్రం" (స్టార్ ఫిష్) అనే జంతువు పెంకు మనకు సముద్రతీరాల్లో లభిస్తుంది. ఇది ఒక్కొక్కటి ఏడాదికి పది లక్షల గుడ్లు పెడుతుంది. అవన్నీబతికి బట్టగడితే ఒక్కోటి మళ్ళీ పదేసి లక్షల గుడ్లు పెడతాయి. ఇలా కొన్ని సంవత్సరాలు గడిచేసరికి వాటి సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయి నేలా, సముద్రాలు అంతటా ఆక్రమించేస్తాయి.

కాని ప్రకృతిలో అలా జరగడంలేదు. దానికి కారణం ప్రకృతికీ, జీవులకూ మధ్య వున్న ఘర్షణలో అనేక జీవులు నశించిపోతాయని డార్విన్ చెప్పాడు. ప్రకృతి అంటే ఒక జీవి చుట్టూ వుండే ఇతర జీవులూ, భౌతిక పరిస్థితులూనూ. ఆహారం కోసం, ఆధారం కోసం జీవులు తమలో తాము పోటీపడతాయి. ఒక జాతిలోని జీవుల్లో మనకు అన్నీ ఒకేలాగా ఉన్నట్లు కనిపిస్తాయిగాని వాటిలో ఏదీ మరోదాన్ని పోలివుండదు.

ప్రకృతికీ, జీవికీ మధ్య ఘర్షణ జరుగుతుంది. ఈ ఘర్షణలో తట్టుకొని నిలబడగలిగేవి లేదా ప్రకృతితో ఐక్యత సాధించినప్పుడు అవి జీవించి సంతానాభివృద్ధి చేస్తాయి. మిగిలినవి నశించిపోతాయి. సంతానాభివృద్ధి చేసిన జీవుల్లో మళ్ళీ విపరీతమైన వైవిధ్యం ఉంటుంది. ఈ వైవిధ్యంగల జీవుల్లో ప్రకృతికి అనుకూలమైనవి బ్రతుకుతాయి. ఈ విధంగా ఒక తరం నుండి మరోతరానికి జీవుల్లో వైవిధ్యం పెరుగుతుంది. దీనివల్ల క్రమంగా పాతజీవ జాతులనుండి కొత్త జీవజాతులు ఏర్పడతాయి. ఇదీ సంగ్రహంగా డార్విన్ సిద్ధాంతం. దాన్ని ప్రకృతి వరణము (నేచరల్ సెలక్షన్) అని ఆయన పేర్కొన్నారు.

అనువుగా జీవులు మారడం (ఎడాప్టేషన్) అనేది దైవ సృష్టి నమూనాలో భాగమని వీరు వాదిస్తారు. ఈ సమయంలోనే జాన్ హెర్షెల్ రచించిన పుస్తకం డార్విన్‌లో ప్రకృతి పరిశీలన, తర్కం పట్ల ఆసక్తి పెంచింది. శాస్త్ర పరిశోధనల నిమిత్తం యాత్రలు చేసే క్రమంలో తనకు ఎదురైన అనుభవాలను గురించి అలెగ్జాండర్ హంబోల్ట్ రాసిన పుస్తకం ఆయనకు మంచి స్ఫూర్తినిచ్చింది. దాంతో వేసవి కాలంలో వేల్స్‌లో భూగర్భ పొరల సర్వే నిర్వహణ యాత్రలో ఆయన పాల్గొన్నాడు. పక్షం రోజుల యాత్ర ముగించుకుని డార్విన్ తిరిగి వచ్చేసరికి ఆయనకోసం వృక్ష శాస్త్రవేత్త హెన్‌స్లో వద్దనుండి వచ్చిన ఒక ఉత్తరం వేచిచూస్తోంది. ఈ ఉత్తరం డార్విన్ జీవితంలో, ఆ మాటకొస్తే మొత్తం శాస్త్ర ప్రపంచంలో ఒక చారిత్రాత్మక మలుపుకు కారణమైంది. హెచ్‌ఎంఎస్ బీగిల్ అనే నౌక మరో నాలుగు వారాల్లో దక్షిణ అమెరికాకు తీరప్రాంత సర్వే నిమిత్తం బయలుదేరబోతోంది. కెప్టెన్ రాబర్ట్ ఫిట్జ్‌రాయ్ నాయకత్వంలో వెళుతున్న ఈ నౌకలో ప్రకృతిశాస్త్ర పరిశోధకునిగా వెళ్లడానికి డార్విన్ అన్ని విధాల అర్హుడని ఆ లేఖలో హన్‌స్లో ప్రతిపాదించాడు. డార్విన్ తండ్రికి ఈ యాత్ర ఇష్టం లేకపోయినప్పటికీ ఆయన బంధువుల్లో ఒకరైన జోసియా వెడ్జ్‌వుడ్ ఒత్తిడి మేరకు అంగీకరించాడు. బీగిల్ నౌక దక్షిణఅమెరికా యాత్రకు వెళ్లడం ఇది రెండోసారి. రెండేళ్లల్లో నౌక ప్రపంచాన్ని చుట్టుముట్టి వచ్చేట్లు ప్రణాళిక వేశారు. కాని అది తన చారిత్రాత్మక యాత్రను అయిదేళ్ల పాటు సాగించింది. ఇంగ్లండులోని బర్న్‌పూల్‌లో అది 1931 డిసెంబర్ 10 బయలుదేరి దక్షిణఅమెరికా ఖండపు తీరప్రాంతాన్ని సర్వేచేసి న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలను తాకుతూ దక్షిణాఫ్రికా శిఖరాగ్రం కేప్‌టౌన్ గుండా తిరిగి ఇంగ్లండుకు 1836 అక్టోబర్ 2న చేరుకుంది. ఈ యాత్ర ప్రారంభమయ్యేనాటికి డార్విన్ ఒక శాస్త్రవేత్తగా గుర్తింపు పొందలేదు. అప్పటికి ఆయనకు పెద్దగా ఆసక్తి ఉన్న అంశాలు భూగర్భశాస్త్రం, జీవశాస్త్ర నమూనాల సేకరణ మాత్రమే. కాని డార్విన్ ఈ యాత్రలో గుర్తించిన అంశాల ఆధారంగానే "జాతుల ఆవిర్భావం" పుస్తకం రాశాడు. దానికి ఆయనకు 20 ఏళ్లకు పైగా పట్టింది. అంటే బీగిల్ యాత్ర ప్రారంభించిన (1931) నాటినుండి 'జాతుల పుట్టుక' గ్రంథం (1859) రాసేవరకు 28 సంవత్సరాలు పట్టింది. ఇంత సుదీర్ఘకాలం పట్టడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది, ఆయన తన యాత్ర కాలంలో సేకరించిన నమూనాలను ఒక క్రమ పద్ధతిలో పేర్చుకుని, యాత్రకాలంలో తను గుర్తించిన దృగ్విషయాలకు జోడిస్తూ పరిశోధన చేయడం దీర్ఘకాలం పట్టింది. రెండోది తన పరిశోధనలో జీవులు పరిణామం ద్వారా ఆవిర్భవించాయన్న విషయం తెలుసుకున్న తరువాత కూడా ఆయన చాలా కాలం పుస్తకాన్ని ప్రచురించకుండా ఆపాడు. దానికి కారణం పూర్తి ఆధారాలతో పత్రాన్ని విడుదల చేయాలనుకోవడమే.

జాతుల ఆవిర్భావానికి 'ప్రకృతి వరణం' (నేచురల్ సెలక్షన్) కారణమని డార్విన్ కనుగొనడానికి ఆయన నివసించిన కాలం నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులు చాలా వరకు తోడ్పడ్డాయి. అది పారిశ్రామిక విప్లవం జోరుగా సాగుతున్న కాలం. యూరప్ అంతటా కొత్త కొత్త పరిశ్రమలు వెలుస్తున్నాయి. ఇంగ్లండుతో సహా యూరోపియన్ దేశాలు ప్రపంచమంతటా వలసలు స్థాపించడంతో ప్రయాణ అవసరాలు పెరిగాయి. రైల్వేలు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందటంతో అనేక చోట్ల కొండలు తొలిచి గుహలు ఏర్పాటు చేయడం, అడవులు, నదుల మీదుగా రైల్వే లైన్లు వేయడం జరిగింది. ఈ పనులు భూగర్భ పరిశోధనకు తోడ్పడ్డాయి. మనం నివసిస్తున్న భూమి స్థిరంగా లేదని ప్రకృతి శక్తుల ప్రభావంతో కాలానుగుణంగా భూమిపై పొరలు ఏర్పడుతున్నాయని, అనేక సందర్భాల్లో కిందిపొరలు పైకి, పై పొరలు కిందికి కదులుతున్నాయని హట్టన్, విలియమ్ స్మిత్ వంటి వారు ప్రతిపాదించారు. అన్నిటికీ మించి చార్లెస్ లియెల్ రాసిన భూగర్భశాస్త్ర సూత్రాలు (ప్రిన్సిపిల్స్ ఆఫ్ జియాలజీ) డార్విన్ పరిణామ వాదాన్ని ప్రతిపాదించడానికి ఎంతగానో తోడ్పడింది. భూమిలోని వివిధ పొరలు వివిధ కాలాలకు చెందినవని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఆయా భూగర్భ పొరల్లో ఉండే జీవుల శిలాజాలు కూడా విభిన్నంగా ఉన్నాయి. ఒక పొరలోని శిలాజాలకూ, మరో పొరలోని శిలాజాలకూ కొన్ని పోలికలున్నాయి, కొన్ని తేడాలు కూడా ఉన్నాయి. అంటే జీవజాతులు ప్రస్తుతం మనం చూస్తున్నట్లు గతంలో లేవు అన్న భావన శాస్త్రవేత్తల్లో బలంగా ఏర్పడింది. మరి జాతులు పుట్టుక ఎలా జరిగింది?



డార్విన్ బీగిల్ యాత్ర ప్రారంభించే నాటికే జీవుల పుట్టుకపైనా, భూమి, విశ్వం పుట్టుకపైనా శాస్త్ర ప్రపంచంలో తీవ్రమైన చర్చ జరుగుతోంది. ముఖ్యంగా జీవ శాస్త్రంలో 'పరిణామ' వాదాన్ని సమర్థించే వారు రానురాను అధికమవుతూ ఉన్నారు. అయితే 'సృష్టివాదాన్ని' నిరాకరించడమంటే దైవద్రోహంగా పరిగణిస్తూ వారిపై తీవ్రమైన విమర్శలతో సంప్రదాయ వాదులు విరుచుకుపడుతున్నారు. భూగర్భ శాస్త్రంలో లభించిన ఆధారాలు పరిణామ వాదాన్ని బలపరిచేవిగా ఉన్నాయి. కార్ల్ లిన్నేయస్ వర్గీకరణ సిద్ధాంతం, లామార్క్ ఆర్జిత లక్షణాల వారసత్వ సిద్ధాంతం ముందుకు వచ్చి ఉన్నాయి. కాని ఇవేవీ సృష్టివాదాన్ని నిరాకరించి జాతుల ఆవిర్భావానికి శాస్త్రీయమైన వివరణ ఇవ్వలేకపోయాయి.

కాని డార్విన్‌కు ప్రకృతి వరణం ద్వారా జీవులు ఆవిర్భవిస్తాయన్న ఆలోచన రావడానికి నాడు ఇంగ్లండులో ప్రాచుర్యంలో ఉన్న మాల్థస్ ఆర్థిక సిద్ధాంతం కూడా ఒక కారణం. ఇంగ్లండులో నాడు పెట్టుబడిదారీ వ్యవస్థ బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతోంది. మానవుల ఆర్థిక జీవనంలో విపరీతమైన పోటీతత్వం ఉంది. ఈ పోటీని, పెట్టుబడిదారీ దోపిడీని సమర్థిస్తూ పార్సన్ మాల్థస్ రాసిన జనాభా సూత్రాలు (యాన్ ఎస్సే ఆఫ్ ప్రిన్సిపిల్స్ ఆఫ్ పాపులేషన్) పుస్తకాన్ని డార్విన్

చాలా సార్లు చదివాడు. మనుగడ కోసం పోరాటంలో ఉత్తమమైన వారే విజయాలు సాధిస్తారన్నది మాల్థస్ సిద్ధాంతం. పెట్టుబడిదారీ దోపిడీ సమర్థించుకోడానికి మాల్థస్ ప్రతిపాదించిన ఈ సూత్రం డార్విన్ తన బీగిల్ యాత్రలో పరిశీలించిన దృగ్విషయాలకు కొద్దిమార్పుతో వర్తింపజేస్తే ఆయనకు "ప్రకృతి వరణం" సిద్ధాంతం లభించింది. అయితే ఇదంతా బీగిల్ యాత్ర ముగిసినాక జరిగింది.

జీవజాతులు తనకు ముందున్న జీవజాతులు నుండి అభివృద్ధి చెందుతాయి అన్న నిర్ధారణకు వచ్చిన డార్విన్‌లో అంతకు ముందు జాతుల ఆవిర్భావంపై ఉన్న భావాల్లో కూడా మార్పు వచ్చింది. జీవజాతులను ఇప్పుడున్నట్లు దేవుడు సృష్టించాడన్న భావం దాదాపు ఆయన బీగిల్ యాత్రకు బయలు దేరేటప్పటికే పోయింది. అయితే ప్రపంచ వ్యాపితంగా కొన్ని ప్రాంతాల్లో కొన్ని జాతుల విస్తరణకు కారణమేమిటి అన్నదానికి అప్పుడు శాస్త్ర ప్రపంచంలో వినిపించిన సమాధానం 'సృష్టి కేంద్రాలు' (సెంటర్స్ ఆఫ్ క్రియేషన్) అనేది. అంటే దేవుడు ఒక్కో చోట ఒక్కోరకం జీవులను సృష్టించాడు. అక్కడినుండి అవి తమ చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రకృతి సూత్రాల ప్రకారం విస్తరించుకుంటూ పోయాయి. నిజానికి డార్విన్ బీగిల్ యాత్రలో ఈ "సృష్టి కేంద్రాలను" వెదకడంపై కేంద్రీకరించాడు. కాని ఆయనకు లభించిన సమాధానం జీవ జాతులు తమకు ముందున్న జీవజాతులనుండి పరిణామం ద్వారా ఆవిర్భవిస్తాయని.

ఒక జీవజాతి నుండి మరోజీవజాతి మార్పుద్వారా ఆవిర్భవిస్తుంది సరే ఈ మార్పు ఎలా సంభవిస్తుంది? ఇక్కడే పార్సన్ మాల్థస్ సూత్రాలు

డార్విన్‌కు తోడ్పడ్డాయి. గెలపగోస్ దీవులు ఒక్కో చోట ఒక్కో పరిసరాలు ఉన్నాయి. ఆ పరిసరాలకు తగ్గ లక్షణాలు గల పక్షులు బ్రతకడానికి అవకాశాలు ఎక్కువ. అలా బ్రతికిన పక్షులు తిరిగి సంతానం ఉత్పత్తి చేస్తే అందులో కూడా ఆయా దీవుల ప్రత్యేక లక్షణాలకు అనువుగా ఉన్న జీవులు ఎక్కువ బ్రతుకుతాయి. అనుకూల లక్షణాలు లేనివి చనిపోతాయి. ఆ విధంగా ప్రకృతి వరణం (ఎంపిక) అనేది పాత జాతి జీవులనుండి కొత్త జాతి జీవుల ఏర్పాటుకు కారణం అని ఆయన ప్రతిపాదించాడు. అంతకు ముందు డి కాండొల్లె అనే శాస్త్రవేత్త వృక్షాలపై రాసిన "జాతులు యుద్ధం" పుస్తకం కూడా డార్విన్ ఈ నిర్ధారణకు రావడానికి తోడ్పడింది. అడవిలో అనేక రకాల వృక్ష జాతుల మధ్య మనుగడకోసం పోరాటం జరుగుతుంది. ఈ పోరాటంలో ప్రతిజాతిలోనూ జీవులు చనిపోతాయి. చివరికి అన్ని జాతులు ఒక సమతుల్యత సాధిస్తాయి అని డి కాండొల్లె చెప్పాడు. 1838 సెప్టెంబర్ నాటికి డార్విన్ ఈ నిర్ధారణకు వచ్చినట్లు డైరీలో రాసుకున్నాడు.

ఆ మరుసటి సంవత్సరమే 1839 జనవరి 29న డార్విన్ తన 30 ఏట ఎమ్మా వెడ్జ్‌వుడ్ అనే యువతిని మేనరిక వివాహం చేసుకున్నాడు. తన కుటుంబంలో గతంలో కూడా మేనరికపు వివాహాలు జరగడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు ఎదురైనాయి. బీగిల్ యాత్ర సమయంలోనూ, అంతకు ముందు డార్విన్ తీవ్రమైన అనారోగ్యానికి గురైనాడు. అందువల్ల వివాహం చేసుకోకూడదనుకుని చాలా కాలం తటపటాయించి చివరికి చేసుకున్నాడు. అయితే తరువాత కాలంలో మేనరికపు వివాహం వల్ల తన సంతానానికి కూడా సమస్యలు వస్తాయని భయపడ్డాడు. ఆయనకు పదిమంది సంతానం కలుగగా ఇద్దరు అనారోగ్యంతో మరణించారు. కుటుంబం పట్ల డార్విన్‌కు ఎనలేని శ్రద్ధ. తన ఆరోగ్యం కూడా క్షీణిస్తుండడంతో డార్విన్ జాతులు పుట్టుకపై తన పరిశోధనా గ్రంథాన్ని త్వరగా ప్రచురించాలనుకున్నాడు. ఈ లోగా తన సముద్రయానం గురించి, సర్వే గురించి రాసిన మూడు పుస్తకాలు ప్రచురించాడు. కాని "జాతులు పుట్టుకపై గ్రంథం ప్రచురణకు ముందు మాత్రం ఆయన చాలా ఆలోచించాడు. పక్కాగా ఆధారాలు సమకూర్చుకున్నాడు. ఎందుకంటే తను చేపట్టిన ఈ సమస్య మొత్తం సమాజిక ఆలోచనా క్రమంలో పెద్ద అగ్నిపర్వతాన్ని రగిలిస్తుందన్న విషయం ఆయనకు తెలుసు.

ఈ లోగా ఆల్ఫ్రెడ్ రస్సల్ వాలెస్ అనే శాస్త్రవేత్త "జాతులు పరిచయం" అన్న అంశంపై ప్రచురించిన పత్రాన్ని లియెల్లె చదివాడు. డార్విన్ ఆలోచనలూ, వాలెస్ ఆలోచనలూ ఒకేలాగా ఉన్నాయి. లియెల్లె ఈ విషయాన్ని డార్విన్‌కు చెప్పి వెంటనే ఆయన పత్రాన్ని ప్రచురించాలని కోరాడు.

వాలెస్ డార్విన్‌కు కూడా తన పరిశోధనా పత్రం పంపాడు. దాన్ని చదివిన డార్విన్ తన పత్రాలనూ, వాలెస్ పరిశోధనా పత్రాన్నీ లియెల్లెకు ఇచ్చి ఈ పత్రాలను లిన్నెయస్ సొసైటీకి ఉమ్మడిగా సమర్పించాలని కోరాడు. 1858 జులై1 ఈ రెండు పత్రాలను కలిపి "జాతులు విభిన్న రకాలుగా మారే ధోరణి: మరియు ప్రకృతి వరణం ద్వారా భిన్న రకాలు, జాతుల ఆవిర్భావం" అన్న పేరుతో సమర్పించారు. ఆ తరువాత డార్విన్ తన పరిశోధనా గ్రంథాన్ని 1859 నవంబర్ 22న ప్రచురించాడు. తొలుత విడుదలైన 1,250 కాపీలు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయంటే అప్పటికే ఆయన పరిశోధన ఎంత సంచలనం సృష్టించిందో అర్థమవుతుంది.

పరిణామ వాదాన్ని ప్రతిపాదించిన డార్విన్ గ్రంథాన్ని సాధారణంగా "జాతుల పుట్టుక" అని పిలుస్తున్నప్పటికీ దాని పూర్తి పేరు "ప్రకృతివరణం ద్వారా జాతుల ఆవిర్భావం లేదా మనుగడకోసం పోరాటంలో సానుకూల జాతుల కొనసాగింపు" (ఆన్ ది ఆరిజిన్ ఆఫ్ స్పీషీస్ బై మీన్స్ ఆఫ్ నేచురల్ సెలక్షన్ ఆర్ ది ప్రిజర్వేషన్ ఆఫ్ ఫావర్డ్ రేసెస్ ఇన్ ది స్ట్రగుల్ ఫర్ లైఫ్". విశేషమేమంటే ఆ గ్రంథంలో ఆయన ఎక్కడా 'పరిణామం' (ఇవల్యూషన్) అన్న మాట వాడలేదు. పరిణామం అన్న పదంపై ఆ నాడు అభివృద్ధినిరోధక వర్గాల్లో ఉన్న అపోహలను అధిగమించేందుకే తాను ఈ పనిచేశాడు. అంతే కాదు అయన తన గ్రంథంలో ఎక్కడా మానవుని ఆవిర్భావం గురించి రాయలేదు. ఈ అంశాన్ని చివరిలో ప్రస్తావిస్తూ దీనిపై మరోసారి చర్చిద్దాం అని వదిలేశాడు. తన పరిణామ సిద్ధాంతాన్ని శాస్త్ర ప్రపంచమే కాదు మొత్తం ప్రపంచం ఆమోదించినట్లు తెలుసుకున్న తరువాత ఆయన పరిణామం ద్వారా కోతి జాతులనుండి మానవుడు ఎలా ఆవిర్భవించాడో తెలియజేస్తూ "డిసెంట్ ఆఫ్ మ్యాన్" అనే గ్రంథాన్ని రాశాడు

ఆ విధంగా సృష్టివాదాన్ని సమర్థించేందుకు పరిశోధన ప్రారంభించిన డార్విన్ తుదకు తానే పరిణామ వాద సృష్టికర్తగా పరిణామం చెందాడు.

★

కథ కాని కథ

ఎనిమిదేళ్ల పిల్లల దినచర్య గురించి అడిగితే ఎవరైనా ఏం చెప్తారు? "ఆ... ప్రత్యేకంగా చెప్పకోడానికి ఏముంటుంది? హాయిగా ఆడుకోవడం, అమ్మ బతిమాలి బామాలి బుజ్జగించి పెడితే ఏమైనా తినడం, స్కూలుకెళ్లడం... అల్లరి చేయడం...నిద్రపోవడం...ఇంతకంటే ఏముంటుంది?!' అనేస్తారు సులభంగా. అయితే పదేళ్ల నుజూద్ జీవితం ఇందుకు భిన్నమైంది. పైగా భయానకమైనది. ఊహకు కూడా అందనిది. ప్రస్తుతం ఆ చిన్నారి తన చెల్లెలితో కలిసి స్కూలుకెళుతున్నా... పసివయసులోనే ఎన్నో చేదు అనుభవాలు చవిచూసింది. ఒక జీవితకాలానికి సరిపడా కన్నీరు కార్చింది. బాధను దిగమింగింది. తనకంటే మూడు రెట్లు పెద్దవాడైన భర్త చేతిలో దెబ్బలు తినని రోజులేదు. అత్యాచారానికి గురికాని రోజు లేదు. అవన్నీ భరించలేనని తనను పుట్టింట్లో వదిలిపెట్టమని కన్నీరుమున్నీరవుతూ భర్త కాళ్లమీద పడి బతిమాలింది. వేడుకొంది. అర్థించింది. అయినా అతగాడి రాతి మనసు కరగలేదు. పంటిబిగువున వాటిని కొంతకాలం భరించినా... తనను ఎంతగానో బాధపెడుతున్న హింసనుంచి బయటపడేందుకు...గౌరవప్రదమైన జీవితాన్ని వెతుక్కునేందుకు ఒక రోజు అడుగు ముందుకేసింది. సరాసరి కోర్టు మెట్లెక్కింది. తనకు విడాకులిప్పించమని ఏకంగా న్యాయమూర్తినే కోరింది. ఆ వాస్తవ కథనం అక్షర రూపంలో ....

పదేళ్లకే పెళ్లి... విడాకులు

కె.అంజన

నుజూద్ గురించి చెప్పుకోవాలంటే... ఎమెన్ వెళ్లాలి. ప్రపంచంలోని అత్యంత పేద దేశాల్లో అదొకటి. అక్కడ ఆడపిల్లలకు చాలా చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తుంటారు. అయితే వారు ఈడొచ్చాక మాత్రమే భర్తతో కలసి జీవించాలి. కానీ పెద్దలెవరూ దీన్ని అనుసరించరు. పిన్నవయసులోనే పెళ్లిళ్లు కానిచ్చేసి కాపురానికి పంపేస్తుంటారు. నుజూద్ అలాంటి వేలాదిమంది ఆడపిల్లల్లో ఒకర్తె. తండ్రి నిరుద్యోగి. పైగా పది మంది సంతానం. ఒక చిన్నపాటి గదిలో జీవనం. అవేవీ కూడా ఆ పాపకు పెద్దగా కష్టాల్లాగా అనిపించలా. ఎప్పుడైతే తనకు పెళ్లి చేయాలని అమ్మానాన్నలు భావించారో అప్పుడే తన కన్నీటి గాథ ఆరంభమైంది. అప్పుడు నుజూద్‌కు సరిగ్గా ఎనిమిదేళ్లు. మోటారు సైకిళ్లను డెలివరీ చేసే ముప్పయ్యేళ్ల ఫయిజ్ అలీతో వివాహం చేయాలని నిశ్చయించారు. 250 డాలర్ల కట్నం కూడా ఇవ్వడానికి సిద్ధమయ్యాడు ఆమె తండ్రి. తనకు ఆ పెళ్లి ఇష్టం లేదని ఏడ్చిమొత్తుకున్నా వినే దిక్కెవరు? ఆఖరుకు కన్నతండ్రి కూడా ఆమె గోడు వినలేదు. పెళ్లి చేసుకోవాల్సిందేనని చెప్పాడు. ఆశ్చర్యకరమైన విషయమేంటంటే... ఆమె తన భర్తను పెళ్లి సమయంలోనే తొలిసారిగా చూడడం. పెళ్లయిన ఏడాది చదువు పూర్తిగా అటకెక్కింది. ఆమె చెల్లెలు హిఫా మాత్రం సానా వీధుల్లో స్వీట్లు అమ్మేది. అదే ఆ కుటుంబానికి ప్రధానమైన ఆధారమంటే ఆశ్చర్యమేస్తుంది.

పెళ్లయ్యాక అత్తవారింటికి వెళ్లింది నుజూద్. తొలి రోజు...తొలి రాత్రే...సమస్య ప్రారంభమైంది. ఆమె భర్త ఫయిజ్ అలీ గదిలో లైట్ తీసిన వెంటనే ఆమె బట్టలు ఒక్కటొక్కటిగా తొలగించాడు. భయంతో ఏడుస్తూ... గదిలోంచి బయటికి పరుగెత్తింది. అతని బారి నుంచి రక్షించుకోవడానికి అలా ఒక గదిలోంచి మరొక గదిలోకి పరుగెడుతూనే వుంది. కానీ ఎంతసేపు? అతను ఆమెను పట్టుకున్నాడు. విజయగర్వంతో తిరిగి గదిలోకి లాక్కెళ్లాడు. తన పైశాచిక చర్యలను అడ్డుకుంటున్నదని ఆమెను కొట్టాడు. అనుకున్నది సాధించాడు. ఆ పాప ఏడుపు...బాధ...కన్నీరు...నొప్పి...అయిష్టం...అసహ్యం...ఏవీ అతనికి పట్టలేదు. అసలు పెళ్లంటే ఏంటో...భార్యాభర్తల బంధం ఎలాగుండాలో తెలీని పసిగుడ్డు వీటన్నిటినీ తట్టుకోలేకపోయింది. ఎంతైనా ఎనిమిదేళ్ల పసిది. తోటి పిల్లలతో కలిసి ఆడుకోవాలని మనసు ఆరాటపడుతుంటుంది కదా. అత్తవారింటి దగ్గర కూడా ఆడుకోడానికి బయటికెళితే చాలు. భర్త వచ్చి కొట్టి మరీ పడకగదిలోకి ఈడ్చుకెళ్లేవాడు. మళ్లీ హింస మొదలు. ఈ నరకం భరించలేక తన పట్ల దయచూపమని వదిలిపెట్టమని వేడుకున్నా ... అతను చలించేవాడు కాదు. అలా రెండు నెలలపాటు భర్త హోదాలో ఆ పసిదానిపై అత్యాచారపర్వం సాగించాడు.

అతనితో కలిసి కాపురం చేయలేనని తనకు విముక్తి కల్పించమనీ అమ్మానాన్నలను, అత్తమామలను వేడుకుంది. అయినా ఎవరూ సానుకూలంగా స్పందించలేదు. పైగా "అదేం కుదరదు. కావాలంటే నీకు నువ్వే సొంతగా కోర్టుకెళ్లి విడాకులు తీసుకో" అని ఒక విచిత్రమైన సమాధానం చెప్పేది అత్తగారు. అయినా సరే తనను పుట్టింటికి పంపమని ప్రతిరోజూ భర్తను అడిగేది. అతగాడు స్పందించేవాడుకాడు. దాంతో ఒకరోజు తనే ఏదో ఒకటి చేయాలని నిశ్చయించుకుంది. ఓరోజు బ్రెడ్ కొనుక్కురావడానికి షాపుకు వెళ్లాల్సివచ్చింది. ఇంక అదే మంచి అవకాశమనుకుంది. వెంటనే బస్ ఎక్కి నిత్యం రద్దీగా వుండే రాజధాని నగరం సనా వెళ్లింది. అక్కడినుంచి టాక్సీ మాట్లాడుకొని కోర్టుకెళ్లింది. ఆ తర్వాత ఏం చేయాలో తెలీలా! కోర్టుహాల్ బయట ఒక మూలగా వున్న బెంచీమీద రోజంతా కూర్చుండిపోయింది. నుజూద్ గాథ గురించి తెలీకపోయినా రోజంతా అక్కడే కూర్చుని వుండడానికి గమనించిన జడ్జిగారు తనను పలుకరించి ఏం కావాలని అడిగారు. ఆయన అడిగిందే తడవుగా..."విడాకుల కోసం వచ్చాను" అంది నుజూద్. ఆ తర్వాత తను చెప్పిన వివరాలు విని ఆశ్చర్యపోయారు. బాధపడ్డారు. తనను కూడా వెంట ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ రెండు రోజులపాటు వారి ఎనిమిదేళ్ల పాపతో ఆడుకుంటూ గడిపింది. తర్వాత ఆమెకు భర్తనుంచి విడాకులు అందాయి. అంతేకాక పలు అంశాలు ప్రపంచం దృష్టికి

వచ్చాయి. ఎమెన్ వివాహ చట్టం గురించి మానవహక్కుల కార్యకర్తలు, పార్లమెంటు సభ్యులు, న్యాయవాదుల్లో చర్చనీయాంశమైంది. ఇప్పుడు బాలికల కనీస వివాహ వయసు 15 సంవత్సరాలు. ఇందుకు ప్రధాన కారణం ఒకటే. ఇలాంటి కేసులు ఎమెన్‌లో ఎన్నో. కానీ ఏ ఒక్కటీ ఇంత సంచలనం సృష్టించలేదు. ఇది మాత్రమే ఇంత ప్రచారం కావడానికి ఒక్కటే కారణం. కేసు కోర్టు మెట్లు ఎక్కి న్యాయమూర్తి వరకూ రావడమే.



తర్వాత నుజూద్ గాథ ఎమెన్ దేశంలోనేగాక, ప్రపంచవ్యాప్తంగా మీడియాలో వచ్చింది. ఆమె కేసు వాదించిన న్యాయవాదికి లెక్కలేనన్ని ఇమెయిళ్లు, ఫోన్లు, ఉత్తరాలు వచ్చాయి పాపకు ఆర్థిక సాయం చేస్తామంటూ. ఇప్పుడు నుజూద్ తన చెల్లెలితో కలిసి ఓ ప్రయివేట్ పాఠశాలలో చదువుకుంటోంది. పెద్దయ్యాక లాయర్ కావలన్నదే ఆ చిన్నారి కల. తనలాగా బాల్యవివాహాలకు మరెవరూ బలికాకుండా సాయం చేయాలన్నదే నుజూద్ ఆశ...ఆశయం.

అన్నట్టు నుజూద్ ఆటోబయోగ్రఫీని (తను చెప్తుంటే ఫ్రెంచ్ రిపోర్టర్ డెల్ఫిన్ ఈ పుస్తకాన్ని రాసి పెట్టారు) ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విపరీతంగా ఆదరిస్తున్నారు. అంతేకాదు! న్యూయార్క్‌కు చెందిన గ్లామర్ మేగజైన్ తనకు 'వుమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ఇచ్చి సత్కరించింది. ఏమైతేనేం పదేళ్లకే పెళ్లయి...విడాకులు తీసుకొని...తిరిగి తనకెంతో ఇష్టమైన చదువును కొనసాగించడమంటే చిన్న విషయం కాదు. ఇష్టంలేని పెళ్లిని... భర్తను ...బంధాన్ని... హింసను వదిలించుకోవడం అంత తేలిక కాదు. పసి వయసులోనే ఆ పని చేసి తనలాంటి ఎందరో చిన్నారులకు ఆదర్శంగా నిల్చిన నుజూద్‌ను అభినందించాల్సిందే.

★

ఆసియా బదులు అమెరికాను కనుగొన్న కొలంబస్

ఇటలీకి చెందిన ప్రముఖ నావికుడు క్రిస్టఫర్ కొలంబస్ అసలు పేరు క్రిస్టోబాల్ కొలాన్. యూరప్ నుండి ఆసియాకు సముద్ర మార్గం కనుగొనాలని కొలంబస్ ఎంతగానో అనుకునేవాడు. సముద్రంలో పశ్చిమంగా యూరప్ నుండి ఆసియాకు ప్రయాణ దూరం 3,550 నాటికల్ మైళ్లుంటుందని కొలంబస్ అంచనా వేశాడు. అంతేకాక అక్కడికి వెళ్లడం సాధ్యమేననుకున్నాడు. అనుకున్నదే తడవుగా తన సాహస ప్రయాణానికి ఆర్థిక సాయం చేసే వారి కోసం వెతకడం మొదలు పెట్టాడు. అయితే ఎవ్వరూ ముందుకు రాలేదు. చివరకు స్పెయిన్ రాణి ఇసబెల్లా కొలంబస్‌కు సాయం చేసేందుకు అంగీకరించారు. అత్యంత సంపన్నవంతమైన ఆసియా భూభాగాన్ని చేరుకోవడం కొలంబస్ వంటి వారికే సాధ్యమవుతుందని ఇసబెల్లా భావించారు. 1492 ఆగస్టులో తన చారిత్రాత్మకమైన సముద్ర ప్రయాణాన్ని ప్రారంభించేందుకు కొలంబస్ నిర్ణయించుకొన్నాడు. కొలంబస్‌తో ప్రయాణించే ఇతర సిబ్బందికి దూర ప్రయాణం గనుక ఆహార పదార్థాలు చెడిపోతాయనే భయం పట్టుకుంది. కొలంబస్ మాత్రం సరిపోతాయని ధైర్యంగా వున్నాడు. అయితే యూరప్ నుండి ఆసియాకు సముద్ర ప్రయాణ మార్గం దూరాన్ని అంచనా వేయడంలో కొలంబస్ ఘోరమైన తప్పటడుగు వేశాడు. ప్రాచీన భౌగోళికవేత్త టోలెమీ వేసిన అంచనాల పైనే కొలంబస్ ఆధారపడడంతో ఈ ప్రమాదమెదురైంది. కొలంబస్ అతని సిబ్బంది ఆసియా చేరుకోవాలంటే 3,550 మైళ్ళుకాదు. 12 వేల మైళ్ళదూరం ప్రయాణించాల్సి వుంది. అయితే ఈ సంగతి తెలిస్తే మాత్రం కొలంబస్ ఈ ప్రయాణం చేయాలని నిర్ణయించుకొనేవాడు కాదు. కానీ తన తప్పుడు అంచనా ఫలితంగా పది వారాల ప్రయాణం అనంతరం కొలంబస్ బృందం అమెరికాను కనుగొన్నది. అయితే అది చైనా లేదా భారత్ అయివుంటుందని కొలంబస్ భావించాడు. ఆ తరువాత అమెరికాకు ఐదుసార్లు ప్రయాణించిన కొలంబస్ తాను ఆసియాకు మార్గాన్ని కనుగొన్నాననే తృప్తితోనే మరణించాడు.

తెలుసా

చర్చి దొంగతనం

చర్చి ఏమిటీ? దొంగిలించడమేమిటీ? అని విచిత్రంగా వుంది కదూ. కానీ ఇవి నిజం. కెనడాలో 1897లో ఈ సంఘటన జరిగింది. దాని పూర్వాపరాలు చూద్దాం. పశ్చిమ కెనడాలో ఒకప్పుడు డొనాల్డ్ అనే ఒక సెటిల్‌మెంట్ వుండేది. కెనడా పసిఫిక్ రైల్వేకు అది ప్రధాన కేంద్రం. డొనాల్డ్‌లో నివశిస్తున్న వారంతా రైల్వేలో పని చేసే వారే. 1897లో కెనడా పసిఫిక్ రైల్వే తన ప్రధాన కేంద్రాన్ని 180 కిలోమీటర్ల దూరంలో గల మరో పట్టణానికి మార్చాలని నిర్ణయించింది. దీంతో డొనాల్డ్‌లోని వారంతా సమీప పట్టణమైన విండ్ మియర్‌కు తరలిపోయారు. డొనాల్డ్ నుండి ప్రధాన కేంద్రాన్ని మార్చిన రైల్వే శాఖ అక్కడ తాను నిర్మించిన చర్చిని కూడా తరలించాలని నిశ్చయించింది. అయితే విండ్ మియర్‌లోని డొనాల్డ్‌వాసులకు అది నచ్చలేదు. వారు తమతోటే వుండాలనుకున్నారు. దీంతో వారు డొనాల్డ్ గ్రామానికి వెళ్లి చర్చిని ఏ భాగానికి ఆ భాగాన్ని వూడదీసి తమతోబాటు పట్టుకుపోయారు. అయితే మార్గమధ్యలో గోల్డెన్ గ్రామస్థులు ఈ చర్చి గంటను దొంగిలించారు. గోల్డెన్ గ్రామంలోని చర్చికి చాలా కాలంగా గంట లేకపోవడంతో ఇదే అదనుగా భావించి వారు గంటను ఎత్తుకుపోయారు. గోల్డెన్‌లో చర్చి ఇప్పటికీ వుంది. దీనికి "దొంగిలించబడిన గంట యొక్క సెయింట్ పాల్ చర్చి" అని పేరు. అయితే దొంగిలించబడిన చర్చి సంగతేమైందో చూద్దాం. చర్చి విడిభాగాలను తీసుకొనిపోయిన డొనాల్డ్ వాసులు వాటితో విండ్ మియర్‌లో చర్చిని నిర్మించుకున్నారు. ఆ చర్చి పేరేమిటో తెలుసా! "దొంగిలించబడిన సెయింట్ పీటర్స్ చర్చి". ఇదీ విచిత్రంగానే వుందా!

★

ఆరోగ్యం

అనుమానం వ్యాధా?



లలిత, వినోద్‌లది ప్రేమ వివాహం. ఇద్దరు పిల్లలు. పెళ్లై 13 ఏళ్లయ్యింది. మొదట్లో జీవితం సాఫీగానే సాగింది. ఒకసారి ఫంక్షన్ వుందని భర్తతో సహా పుట్టింటికి వచ్చింది లలిత. ఒక రాత్రి ఇద్దరు గొడవ పడ్డారు. కొట్టుకున్నారు. ఇంట్లో వాళ్లు విషయం ఏంటని నిలదీశారు. అప్పుడు చెప్పింది లలిత అసలు విషయం. 'నా భర్తకు అనుమానమనే పిచ్చి వుంది. అన్ని విషయాల్లో బాగుంటాడు. పని చేయడంలో. పిల్లలతోనూ బాగానే గడుపుతాడు. ఒక్క దురలవాటు కూడా లేదు. చివరికి వక్కపొడి కూడా తినడు. కానీ నేనెవరితోనైనా మాట్లాడినా, రోడ్డుపై వెళ్తున్నప్పుడు పక్కగా ఎవరైనా వెళ్తున్నా.. ఇలా వారితో నాకు సంబంధం వుందని, నన్ను చంపడానికి పురమాయించానని వేధిస్తాడు. విపరీతంగా కొడతాడు. మొదట్లో భరించాను. తర్వాత నేనూ కొట్టడం మొదలైంది. ఇలా కొట్టుకోవడం మాకు అలవాటైంది. మా గొడవ చూసి తొలుత పిల్లలు భయపడేవారు. ఇప్పుడు వాళ్లకి అలవాటైంది. ఒకసారి చెప్పకుండా పుట్టింటికి వచ్చాను. నన్ను తీసుకెళ్లడానికి ఇంటికొచ్చాడు. నేను లేకుంటే ఒక్కడే వుండలేడు. విజయవాడలో డాక్టర్‌కు చూపించాం. మందులు వాడాలన్నారు. ఒక ఏడాది వాడాడు. అప్పుడు బాగానే వున్నాడు. తర్వాత మానేశాడు. మళ్లీ అనుమానం మొదలైంది. ఈ మధ్య తెలిసిన విషయం ఏంటంటే వినోద్ మేనమామకు కూడా ఇలాంటి అనుమానమనే జబ్బు వుందని' లలిత చెప్పుకొచ్చింది. ఇలా అనుమానంతో భార్యను వేధించే వారు మన మధ్యలోనే వుంటారు. సాధారణ అనుమానానికి... మానసిక జబ్బు అనుమానికి చాలా తేడా వుంటుంది. ఈ అనుమానం ఎందుకొస్తుందో.. దీనికి చికిత్స ఏమిటో తెలుసుకుందాం..

డాక్టర్ ఎ.శేఖర్ రెడ్డి,
న్యూరో సైకియాట్రిస్ట్
యాక్సన్ హాస్పిటల్, అమీర్‌పేట్,
హైదరాబాద్.
ఫోన్ : 9848059452

సహజంగా అనుమానించడం వేరు. అసాధారణంగా అనుమానించడం వేరు.

ఫోన్‌లో ఎవరైనా మాట్లాడినా, రోడ్డు వెంట వెళుతున్నప్పుడు పిలిచినా అనుమానిస్తాం. ఇంట్లో ఏదైనా శబ్దం వస్తే పిల్లి లేదా ఎలుక అనే అనుమానం వస్తుంది. కొన్ని నిమిషాలు మాత్రమే ఆలోచిస్తాం. ఇది సాధారణం. కానీ అసాధారణ అనుమానం అలా కాదు. దాని గురించి మళ్లీ మళ్లీ ఆలోచనలు మొదలవుతాయి. రాత్రంతా నిద్ర వుండదు. పరిశోధన చేయడం, నిఘా పెట్టడం చేస్తారు. భర్త లేదా భార్యపై అనుమానం వుంటే ఇంట్లో కెమెరా, టేప్ రికార్డర్ పెట్టడం చేస్తారు. బయటికి వెళ్లినప్పుడు డిటెక్టివ్‌లను వెంట పంపించి ఏం చేస్తున్నారో కనుక్కుంటారు. దీన్ని అసాధారణ అనుమానం అంటారు.

అనుమానం వ్యాధిని డెల్యూషనల్ డిజార్డర్ అంటారు. ఈ వ్యాధి వున్న వాళ్లు అన్ని పనులు సరిగ్గా చేస్తారు. కేవలం ఆ పరిస్థితిలోనే అనుమానంతో ఉద్రిక్తులై హింసాత్మకంగా ప్రవర్తిస్తారు. నేనే గొప్ప, ఎవరో ఒక వ్యక్తి చంపడానికి నన్ను వెంబడిస్తున్నారు... ఇలా ఆ స్థితిలోనే వీరు ఇలా ప్రవర్తిస్తారు. ఇతర సమయంలో ఆఫీసులో, ఎక్కడికెళ్లినా .. అనుమానం.. కానీ నిజమనిపిస్తుంది. దీన్ని వాళ్లు దృఢంగా నమ్ముతారు. భార్యాభర్తలు ఒకరినొకరు అనుమానించడం ఒక స్థాయి వరకు మాత్రమే. కానీ హద్దు దాటితే అది వ్యాధిగా మారుతుంది. ఇది నాలుగైదు రకాలు. వాటి గురించి చెప్పుకుందాం.

ఎరటో మానియా

ఉన్నత స్థానంలోని వ్యక్తులు తమను ప్రేమిస్తున్నారని భావిస్తారు. ఆ మధ్య గుంటూరుకు చెందిన ఒక వ్యక్తి ప్రియాంక గాంధీ తనను ప్రేమిస్తుందని ప్రచారం చేసుకున్నాడు. డాక్టర్ వద్దకు చికిత్స కోసం వచ్చిన వారు కొంత కాలమయ్యాక డాక్టర్‌పైనే ప్రేమలో పడతారు. డాక్టరే ప్రేమలేఖలు రాస్తున్నారనే భ్రమలో వుంటారు.

గ్రాండియోసిటి

కొంత మంది తమకు తాము గొప్పవాళ్లమని అనుకుంటారు. అన్నీ తెలుసని భావిస్తారు. వీఐపీ అని చెప్పుకుంటారు. తామే గొప్ప అనుకుంటారు.

జెలసీ

భార్యాభర్తలిద్దరు బాగానే వుంటారు. కానీ పార్టీలు, పెళ్లిళ్ల, ఫంక్షన్లకు, బయటికి వెళ్లినప్పుడు సమస్య మొదలవుతుంది. భార్య లేదా భర్తతో ఎవరైనా ఎక్కువసేపు మాట్లాడితే తట్టుకోలేరు. ఎవరు వాళ్లు? ఎందుకు మాట్లాడుతున్నారని గొడవ పడతారు. కొంత మంది ఆల్కహాల్ ఎక్కువ తీసుకున్నప్పుడు ఈ సమస్య కలుగుతుంది.

పర్‌సెక్యుటరి

ఎవరో తమను చంపాలని, నాశనం చేయాలని, తమ స్థానం నుంచి తొలగించాలని ప్రయత్నం చేస్తున్నారని అనుమనిస్తారు.

సొమాటిక్

తమలో ఏదో ఒక లోపం వుందని తమపైనే అనుమానం మొదలవుతుంది. ఎంతో మంది డాక్టర్లను కలుస్తారు. కానీ వారిలో ఎలాంటి లోపం వుండదు.

సమాజంలో 0.25 నుంచి .3 శాతం మందిలో ఈ సమస్య వుంటుంది. దీంతో కుటుంబ సభ్యులు మానసిక వేదనకు గురవుతారు. హింసాత్మక ప్రవర్తనతో భయకంపితులవుతారు.

కారణాలు

మెదడులోని డోపమైన్ అనే రసాయనం ఎక్కువైనప్పుడు ఈ మానసిక రుగ్మత వస్తుంది.

అతిగా ఒత్తిడికి గురైనప్పుడు ఈ సమస్య బయటపడుతుంది. దీన్ని మొండి వ్యాధిగా అభివర్ణించొచ్చు. చికిత్స కొంచెం కష్టమే. ఎందుకంటే అన్ని విషయాల్లో బాగుండి ఒక విషయంలోనే సమస్య.

వంశపారంపర్యంగా కూడా ఈ డిల్యూషన్ డిజార్డర్ వస్తుంది.

ఒక్కోసారి శారీరక సమస్యలున్నా ఇలా ప్రవర్తించే అవకాశముంది.

చికిత్స

డిల్యూషన్ డిజార్డర్‌తో బాధపడే వారికి చికిత్స చేయడం కష్టమే. ఎందుకంటే అనుమానం అనే రుగ్మతలో రోగి కూరుకుపోయి వుంటాడు. చికిత్స చేయించుకోవడానికి ఉత్సాహంగా వుండరు. యాంటిసైకోటిక్ మందులు వాడతారు. సైకోథెరపీ చేస్తారు. హోమిసైడ్ (ఇతరులను చంపడం), సూసైడ్ (ఆత్మహత్య చేసుకోవడం) అనే ఆలోచనలతో రోగి వుంటాడు. పరిస్థితిని బట్టి షాక్ ట్రీట్‌మెంట్ కూడా చేస్తారు. ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేయించాల్సి వుంటుంది.

తన భాగస్వామి ఉన్నతంగా వుందనే ఇన్‌ఫిరియారిటీ కాంప్లెక్స్‌వల్ల కూడా వారిలో జలసీ మొదలవుతుంది. కౌన్సిలింగ్ ద్వారా సమస్యకు మూల కారణం కనుక్కుంటారు. మార్పు తీసుకొస్తారు.

ఎంత తొందరగా గుర్తిస్తే అంత త్వరగా చికిత్స చేసి నయం చేయొచ్చు. అనుమానంతో ఇంట్లో ఎవరైనా ప్రవర్తిస్తుంటే మానసిక వైద్య నిపుణుడిని సంప్రదించడం మంచిది. ఈ సమస్యతో బాధపడేవారు మందులు వాడడానికి, చికిత్స చేయించుకోవడానికి ఆసక్తి చూపరు. అందుకని కుటుంబ సభ్యులంతా కలిసి రోగికి ధైర్యం చెప్పాలి.

★









కవిత్వమ్

అక్షరం క్షమించదు

- కటుకోర్ఖ్వల రమేష్

నిజం ఎప్పుడూ నిప్పే
అబద్ధం ఎప్పటికైనా అధఃపాతాళానికే
నిజానికి చేదుతనం ఎక్కువ
మింగుడు పడటం తేలికేమీకాదు.
వాస్తవం అక్షరమై వెలిగినప్పుడల్లా
అవినీతి మెదళ్లకు
మతిభ్రమణమ్ కలుగుతుంది
గుమ్మడికాయ దొంగలంటే
భుజాల్ని తడుముకోవడం దేనికి!?

కుచ్చితాలు కుతంత్రాలతో
మనసంతా కుళ్లిపోయాక
వొళ్లంతా కళ్లు చేసుకున్నా...
దృశ్యాలన్నీ దోషపూరితాలే అవుతాయి
సభ్య సమాజం వేలెత్తి చూపినా
పంథా మార్చుకోని
వొంటెద్దు పోకడలన్నీ
నవ్వి పోదురు గాక...
నాకేటి సిగ్గు అనుకుంటే...!
అక్షరాలు సింహస్వప్నాలే అవుతాయి
కలాలకు సంకెళ్లేసి
కులాలకు శంఖం ఊదితే
గద్దెనెక్కి పెద్దలెవరైనా...
దిష్టిబొమ్మలే అవుతారు
ముప్పైమూడేళ్ల ముప్కర చరిత్రకు
మళ్లీ పురుడు పోసినట్లు
ఓ అప్రకటిత అత్యయిక స్థితి!

పుట్టగొడుగుల్లా
పుట్టుకొచ్చే వికృతాలన్నీ
ప్రజాస్వామ్యంపై పంజా విసిరితే
అక్షరం సలాం కొట్టి
గులాంగిరి చేస్తుందా....!
అగ్నికణమై మండదూ...
ఆయుధమై తెగనరకదూ...
ఏలికతనం నియంత పోకడై
చీకటి దాడికి పూనుకుంటే
అక్షరం క్షమించదు
అగ్ని స్నానం చేయిస్తుంది.
తస్మాత్ జాగ్రత్త...!

(అక్షరం పైదాడికి నిరసనగా)

పరిణామగతి

- యాసలపు సూర్యారావు

మానవ మేధస్సులో మొలకెత్తిన
ఆలోచన, లోచన, వివేచనాలు
విశ్వ జనీనతను అంతర్లీనించుకున్నప్పుడు
నేను, నాది, అన్న అనాలోచిత తత్వం
మానవులలో బీజరూపాన్ని సంతరించుకుంది.
అది హద్దులు మీరి, అవధులు దాటి
సర్వాంతర్యామిగా పరిణితి చెందింది
బానిస యజమాని నుండి సామ్రాజ్యాధిపత్యం
వరకు
మానవాళిని పీడించే కబళించే శక్తిని
సంతరించుకుంది.
సూర్యుని చుట్టూ తిరుగుచున్న భూమిని సైతం
తమ చుట్టూ తిప్పుకోవాలన్నంతగా
దుర్నీతి పర్వము అది
మనిషి ప్రకృతిపై నిరంతర అన్వేషణ క్రమాన్ని
అచంచలంగా, తన చేతనా తాత్వికతను
సాగించాడు
సమాజ పరిణామక్రమ పరిణితిని
సమాజగర్భంలో జరిగే స్థితిలయల అస్తిత్వాన్ని
నిరంతర వైరుధ్యాలగతిని నిర్ధారించాడు
భూమి బల్లపరుపుగా వుందన్న
బుద్ధి హీనత్వాన్ని బద్దలు కొట్టేడు
భూమి గుండ్రంగా వుందన్న నిజాన్ని
విశదీకరించాడు
దేవుడే సృష్టిని, సృష్టిలో మనిషిని సృష్టించాడన్న
మేధో రహిత వాదనలని తుత్తునియలు చేశాడు
ప్రకృతిని ప్రకృతే సృష్టించుకుందన్న నిజాలని
విపులీకరించాడు. విశ్వ రహస్యాలని విప్పిచూపాడు
మనిషే దేవుడిని సృష్టించాడన్న
చారిత్రక, పరిణామాత్మక సత్యాన్ని నిత్య సత్యంగా
నిరూపించాడు
కోతి నుండి పరిణితి చెందిన మనిషి
మానవ వికాసానికి ప్రతీకగా మారాడు
చంద్రుడ్ని దేవుడన్న మానవుడే ఆచంద్రునిపై
మరో మానవ ప్రపంచావిర్భావానికి నిచ్చెనలు
వేస్తున్నాడు
గుంపుల తగువుల నుండి దేశాల మధ్య
అణుయుద్ధాల వరకు
పెరిగి పెద్దదయిన రాజ్యాంగ
యంత్రానికి రూప మిచ్చింది
మానవులలోని యుద్ధ వాంఛ,
భూకాంక్ష
మానవ మారణకాండకు గాక
విజ్ఞాన వికాసాలని, శాంతి
సౌభాగ్యాలను
ఆకాంక్షిస్తున్నాడు, నేడు సగటు
మానవుడు
హెగెల్ తాత్వికతలోని అంతఃసారాన్ని
ఆమూలాగ్రం అంతర్లీనించుకున్న
మార్క్స్ మహనీయుడు.

మానవ మేధస్సుతో భూమి ఉపరితలముపై
నిర్మితమయ్యే సమస్త వస్తు సంపదకి
ఆద్యులు యోగ్యులు అయిన సృష్టి కర్తలు
ప్రకృతేతర ప్రపంచావిర్భావానికి
కర్తలు, క్రియలు, తామే అయిన
శ్రమైక్య మానవ శక్తులే కనిపించే
ప్రత్యక్ష దైవాలు
మానవాళిలోని అంతరాలు,
నిరంతర పీడనాభరిత కుతంత్రాలు ఇక
చెల్లవన్నాడు
ఆదిమ కమ్యూనుల మధ్యగల
రాగ ద్వేషాల కతీతమయిన
సమైక్యతా రాగాలు, ఆధునిక మానవ సమాజంలో
వస్తాయన్నాడు.
సమాజంలోని వర్గవైరుధ్యాలను, సృజనాత్మకత
దృక్పథ నేపథ్యంలో



శ్రమ శక్తుల సమైక్యతకు
బంధనాల విముక్తికి
శాస్త్రీయ తాత్వికగతిని
అక్షరీకరించాడు
విశ్వ జనీన మానవ
సాభ్రాతృత్వానికి
మానవాళి నుండే
మనుష్యులు
మేల్కొనాలన్నాడు
మహనీయులు
పుట్టుకొస్తారన్నాడు
అదే అక్టోబరు విప్లవానికి
అరుణోదయ హరివిల్లు
అయింది.
యూరప్‌కి ఆశాకిరణమయ్యింది
ప్రపంచ మానవాళికి మహోదయమయింది
మహామనిషి లెనిన్ చూపిన మమతల బాటగా
వెలసిల్లింది
కర్మ సిద్ధాంతాల కల్మష విష కలశాల నుండి
మానవులు వేరు పడటం ప్రారంభించబడింది
చైతన్యం నుండి భావం ఏర్పడుతుందన్న
హేతు రహితుల భావనా పిడివాదనలకు
పదార్థం నుండే చైతన్యం పుడుతుందన్న
శాస్త్రీయ విజ్ఞానంతో
అజ్ఞానం తిరోగమనం చెందుతుంది నిత్యం
గతితార్కిక మూల సూత్రాల
వెలుగు రేఖల్లో సత్యమై, నిత్యమై సకల మానవాళికి
శిరోధార్యమై
21వ శతాబ్దిలో ప్రపంచ మానవాళి హృదయాల్లో
అంతరాల్లేని మహారుణోదయం ప్రభవిస్తుంది.
ప్రకాశిస్తుంది.

★





కొబ్బరి స్వీటు



టమాటా పచ్చడి



పానీపూరీలు



కాకరకాయ కూర

కొబ్బరి స్వీటు

కావలసిన పదార్థాలు

బియ్యం : పావుకిలో,కొబ్బరికాయ: అరచిప్ప
బెల్లం : పావు కిలోలో సగం (స్వీటు ఎక్కువ కావాలనుకుంటే పావుకిలో వేసుకోవచ్చు)
యాలక్కాయలు : రెండు, నెయ్యి : తగినంత

తయారుచేసే విధానం

బియ్యాన్ని రాత్రిపూట నానబెట్టుకోవాలి. ఉదయం వాటిని కడిగి వడబోసుకోవాలి. కొబ్బరి తురిమిపెట్టుకోవాలి. ఈ రెండింటినీ మిక్సీలో వేసి జారుగా, మెత్తగా రుబ్బుకోవాలి. పొయ్యిపై మందపాటి గిన్నె పెట్టి బెల్లం తురిమి వేసుకోవాలి. అందులో కొద్దిగా నీళ్లు పోసి లేత పాకం వచ్చేవరకూ తిప్పాలి. అందులో ముందుగా రెడీ చేసి పెట్టుకున్న బియ్యం, కొబ్బరి తురుము వేసి నెమ్మదిగా ఉండలు కట్టకుండా తిప్పుతూ ఉండాలి. కొంచెం ఉడికాక కొద్దిగా నెయ్యి వేయాలి. బాగా దగ్గరపడ్డాక మిగిలిన నెయ్యి కూడా వేసుకోవాలి. యాలక్కాయలను పొడిచేసుకొని వేసుకోవాలి. దీన్ని బాగా కలియతిప్పాలి. ఒక పళ్లానికి కొద్దిగా నెయ్యి రాసి ఈ మిశ్రమాన్ని అందులో పోయాలి. కొంచెం చల్లారాక బిళ్లలుగా కట్ చేసుకోవాలి.కావాలనుకుంటే వీటిమీద జీడిపప్పు, బాదంపప్పు ముక్కలు అలంకరించుకోవచ్చు. అంతే కొబ్బరి స్వీటు తయార్. దీన్ని పిల్లలు ఎంతో ఇష్టంగా తింటారు.

టమాటా పచ్చడి

కావలసిన పదార్థాలు

టమాటాలు : పావుకిలో,
పచ్చిమిర్చి :పావుకిలోలో సగం, కొత్తిమీర : ఒక కట్ట
వెల్లుల్లి : 4 గర్భాలు, జీలకర్ర : 1/2 టేబుల్ స్పూన్
ఉప్పు : తగినంత, నూనె : తగినంత

తయారుచేసే విధానం

టమాటాలను శుభ్రంగా కడిగి ముక్కలు చేసుకోవాలి. పచ్చిమిర్చి తొడాలు తీసి కడిగి ఉంచుకోవాలి. పొయ్యిమీద బాండీ పెట్టి కొద్దిగా నూనె వేసి టమాటా ముక్కలు, పచ్చిమిర్చి వేసి బాగా మగ్గనివ్వాలి. తర్వాత కొత్తిమీర కూడా తుంచి వేయాలి. దీన్ని మిక్సీ జార్‌లో వేయాలి. అందులోనే వెల్లుల్లి, జీలకర్ర, ఉప్పు కూడా వేసుకోవాలి. ఒకటి, రెండు సార్లు మిక్సీ తిప్పితే చాలు. ఎక్కువ తిప్పితే మరీ మెత్తగా అయిపోతుంది. అంతే టమాటా పచ్చడి రెడీ..ఇది అన్నంలోకి, దోసెల్లోకి చాలా బాగుంటుంది.

పానీపూరీలు

కావలసిన పదార్థాలు

పానీపూరీలు : ఒక ప్యాకెట్, ఉల్లిపాయ ముక్కలు : ఒక కప్పు, బంగాళదుంపలు: 2 కప్పులు (ఉడకపెట్టి చిదపాలి), ఉప్పు : తగినంత, నల్ల ఉప్పు : తగినంత
చాట్ మసాలా : తగినంత, పచ్చిమిర్చి : 2
చింతపండు : నిమ్మకాయంత, పుదీనా : 1 కట్ట
కొత్తిమీర : 2 కట్టలు (చిన్నవి)

తయారుచేసే విధానం

పానీపూరీల లోపలికి ఉడికించి, చిదిపిన బంగాళదుంపలు (ఆలుగడ్డ) తీసుకోవాలి. దానిలో తగినంత ఉప్పు, ఉల్లిపాయ ముక్కలు కలిపి పక్కనపెట్టుకోవాలి. పానీ తయారుచేయడానికి కొత్తిమీర, పొదీనా, నల్ల ఉప్పు, పచ్చిమిర్చి, చింతపండు రసం వేసి మిక్సీ చేయాలి. ఇప్పుడు గప్‌చిప్ ఒకటి తీసుకొని చిదిమి అందులో బంగాళదుంప మిశ్రమాన్ని పెట్టి ఈ జ్యూస్‌లో ముంచి తినాలి. అబ్బా! భలే బావుంటుంది...

కాకరకాయ కూర

కావలసిన పదార్థాలు

కాకరకాయలు: పావుకిలో
ఉల్లిపాయలు : రెండు (పెద్దవైతే ఒకటి చాలు)
ఉప్పు : తగినంత, నూనె : తగినంత
కారం : తగినంత (కారంలో వెల్లుల్లి, ఎండుకొబ్బరి, జీలకర్ర, పుట్నాల పప్పు వేసి పొడిచేసుకోవాలి)
పంచదార / బెల్లం : కొద్దిగా, పసుపు : చిటికెడు

తయారుచేసే విధానం

ముందుగా కాకరకాయల్ని శుభ్రంగా కడిగి చిన్న చిన్న ముక్కలుగా కోసుకోవాలి. పొయ్యిపై బాండీ పెట్టి నూనె వేసుకొని (కొద్దిగా ఎక్కువే పడుతుంది) అందులో కాకరకాయ ముక్కలు వేసుకొని దోరగా వేయించుకోవాలి. అవి వేగుతున్నప్పుడే ఉప్పు, పసుపు వేసుకోవాలి. బాగా వేగాక కారం, పంచదార / బెల్లం వేసుకొని కొద్దిసేపు ఉంచి దించేసుకోవాలి. అంతే కాకరకాయ కూర రెడీ. కాకరకాయ కూర తినని పిల్లలు కూడా దీన్ని తింటారు.

- శాంతిశ్రీ

పదేళ్ల కవితా సందర్శనం

కవిత్వానికి మిగతా రచనా ప్రక్రియలకు ప్రధానమైన తేడా ఏమిటంటే కవిత్వం శకలాలుగానూ వెలువడే అవకాశముండటం.ఏ పరిణామానికైనా అప్పటికప్పుడు ఆవేశంగా శక్తివంతంగా స్పందించే వీలు కవిత్వానికే ఎక్కువ. కథ అంతకు మించి నవల వంటి వాటికి ఒక పరిధి నిర్ణయించుకుని దాన్ని పూరించుకోవలసి వుంటుంది. అదే కవిత్వం విషయానికొస్తే మినీ కవిత నుంచి మహా కావ్యం వరకూ దేనికది స్వతంత్రంగా భావ ప్రసరణ చేస్తుంది. అందుకే దేశ కాల పరిస్థితులను కవిత్వం అప్పటికప్పుడే ప్రతిబింబించడానికి కవిత్వాన్ని ముందుగా పరిశీలిస్తుంటారు. ప్రపంచ చరిత్రలోనే అత్యంత సంచలనాత్మకమైన గత శతాబ్ది చివరి దశాబ్దంలో తెలుగు కవిత్వం తీరు తెన్నులు తెలుసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడే సంకలనం 'కవితా దశాబ్ది'. ఎస్వీసత్యనారాయణ, పెన్నా శివరామకృష్ణ సంపాదకత్వంలో వెలువడిన ఈ సంకలనంలో వివిధ ధోరణులకు ప్రతీకలనదగిన నూటయాభై కవితలున్నాయి. తొంభయ్యవ దశకంలో స్త్రీ వాదం, దళిత వాదం, మైనార్టీ వాదం, ప్రాంతీయ అస్తిత్వ వాదం, ఆధునికానంతర వాదం, వంటివి ఎన్నో తెరపైకి వచ్చాయి. కవితాత్మకంగా కొత్త కొత్త సూత్రీకరణలూ చేశాయి. సంపాదకులు సవివరమైన ఉపోద్ఘాతంలో ఈ కాలానికి గల ప్రత్యేకతలనూ ఈ దశలో వచ్చిన భిన్న వాదనల సంఘర్షణను స్పృశించారు. "ఈ దశాబ్ది కవిత్వంలో ప్రతిబింబించిన అన్ని ధోరణులనూ అన్ని వాదాలకూ ఉప వాదాలకూ అన్ని రకాల అభిప్రాయాలకూ వీటికి సమాంతరంగా వచ్చిన కవితలకు కూడా ప్రాధాన్యమిస్తూ వీలైనంత వరకూ రాగద్వేషాలకు అతీతంగా ఈ సంకలనాన్ని రూపొందించడానికి ప్రయత్నించాం." అని సంపాదకులు తమ 'ముందుమాట'లో పేర్కొన్నారు. మైనార్టీ మతంలో పుట్టిన వారిని ద్వేషంతో చూడటంపై ఆవేదనను వెలిబుచ్చుతూ ఖాదర్ మొహియుద్దీన్ రాసిన 'పుట్టుమచ్చ' తో ఈ సంకలనం మొదలవుతుంది. ఒక్కొక్కరిదీ ఒక కవితే తీసుకోవడం, వచన కవిత్వానికే పరిమితం కావడం అన్నవి కొలబద్దలుగా చేసుకున్నారు. నూట యాభై మంది పేర్లలో ఏవి ప్రస్తావించినా మిగిలిన వారిని విస్మరించినట్టవుతుంది. ఇలాంటి బృహత్ సంకలనంలో సహజంగానే ఏ కవిత తీసుకోవాలి, ఎవరెవరు వుండాలి అన్న దానిపై భిన్నాభిప్రాయాలుంటాయి. కాని మొత్తంపైన సంపాదకులు తమ పరిధిలో వస్తుగతంగా ఎంపిక చేశారని చెప్పొచ్చు. వీటన్నిటినీ చూశాక తెలుగు కవిత్వంలో వస్తు శిల్ప వైవిధ్యాల విస్తృతి తెలుస్తుంది. దాంతోపాటే ఇక్కడ ప్రజాస్వామిక ప్రగతిశీల భావజాలం పట్టు కూడా విదితమవుతుంది.అంతకన్నా ముఖ్యంగా ఒక దశలో కట్టలు తెగిన ఉద్రేకంతో విరుచుకుపడిన ధోరణులు అనివార్యమైన కాలగతిలో స్తిమితపడటం, సమన్వయం కోసం ప్రయత్నించడం చూస్తాం. అందుకే ఈ సంకలనంలో కాలక్రమణికను బట్టి పోతున్న కొద్ది ప్రపంచీకరణ వ్యతిరేకత ప్రధానాంశంగా మారడం గమనిస్తాము. ఎక్కువ పుస్తకాలు తిరగేయనవసరం లేకుండా తెలుగు కవితా విహారం చేయదల్చుకున్న వారికి ఈ పుస్తకం చక్కటి ఉపకరణం. ఉత్సాహ కారణం కూడా.

కవితా దశాబ్ది
(1991-2000 కవితా సంకలనం)
డా॥కిన్నెర శ్రీదేవి
వెల:150/-,
పేజీలు: 332,
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్, బ్యాంక్ స్ట్రీట్, విజ్ఞాన భవన్, హైదరాబాద్.

- పీపీ



సాహిత్య దృక్కోణం
తెలుగు సాహిత్య విమర్శ వ్యాసాలు
డా॥కిన్నెర శ్రీదేవి
వెల:80/-,
పేజీలు: 140,
ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్, అబిడ్స్, సుల్తాన్ బజార్.

విమర్శనా వీచిక

డాక్టర్ కిన్నెర శ్రీదేవి విమర్శనా వ్యాస సంకలనం 'సాహిత్య దృక్కోణం' వివిధ కాలాలకూ ప్రక్రియలకూ సంబంధించిన రచనల రసానుభూతిని పంచిపెడుతుంది. పరామర్శించినవి చాలా వరకూ ప్రసిద్ధమైనవీ, జన ప్రియమైనవీ. స్వతహాగా తెలుగు సాహిత్య పరిశోధకురాలు, బోధకురాలు అయిన డా॥శ్రీదేవి ఇప్పుడు విమర్శనా రంగంలో పదిమంది అభినందనలందుకుంటున్న కృషీవలురాలు. రచనాపరంగానే గాక సాహిత్య వేదికలలోనూ పాలు పంచుకునే ఉత్సాహ వంతురాలు. ఈ సంపుటిలోని రెండు పదుల సమీక్షా వ్యాసాలలోనూ నాలుగు కన్యాశుల్కంలోని గురజాడకు సంబంధించినవే. ఇప్పటికే ఉద్దండులు లోతుగా తరచి చూసిన రీత్యా వాటిలో పేర్కొన్న అంశాలు పరిచితమైనవే అనిపిస్తాయి. తర్వాత బోయి భీమన్న నాటకాలలో సామాజిక న్యాయ సందేశాన్ని విశ్లేషించి ఎవరూ ఎవరినీ అణగదొక్కని ఆదర్శ సమాజమే ఆయన సామాజిక స్వప్నమని ముగించారు. డా॥పి.శ్రీదేవి కాలాతీత వ్యక్తులు నవలను చాలా అభిమానంగా సమీక్షించారు గాని అందులో అభ్యుదయాన్ని సరైన కోణంలోనే చూశారా అన్నది సందేహం. ఇక ఓల్గా స్వేచ్ఛలో మొదటిసారి ముందకొచ్చిన స్త్రీ వాద లేదా స్త్రీ కోణ సాహిత్యాన్ని సరిగ్గానే పరిశీలించారు.మాదిరెడ్డి సులోచన, ఆచంట శారదా దేవి వంటి వారి రచనల ప్రత్యేకతలనూ పరిమితులనూ కూడా దృష్టికి తెచ్చారు. కవికోకిల జాషువా గబ్బిలం కావ్య నేపథ్యాన్ని ఆయన కవితా వైదుష్యాన్ని విశ్లేషించే వ్యాసం చాలా సమగ్రంగా రూపొందింది. విద్వాన్ విశ్వం పెన్నేటి పాటపై రాసిన చిన్ని పరిశీలనలో ప్రధానంగా రాయలసీమ స్థితిగతుల చిత్రణను విశ్లేషించారు. సినారె, విశ్వనాథల కావ్యాలతో పాటు ప్రాచీన సాహిత్యంపైనా నాలుగు వ్యాసాలున్నాయి. మొత్తంపైన ఇవన్నీ రచయిత్రి పరిశీలనా శక్తిని విమర్శనాదృష్టిని తెలియజేస్తాయి. ముందు మాటలో వైస్ ఛాన్సలర్ కుసుమ కుమారి సూచించినట్టు ఆమె తన విమర్శను మరింత పదును పెట్టుకుని పరిణితి పెంచుకోవాలన్నది నిజం. ఈ పుస్తకాన్ని రాచపాళెం చంద్రశేఖరరెడ్డికి అంకితమిచ్చారు.

- వివేక్









బిస్కెట్ల భవనాలు

బిస్కెట్లను తినడం కోసమే తయారుచేస్తారని ఇప్పటి వరకు మనకు తెల్సు. కానీ కొంతమంది వుంటారండోయ్! వారు ప్రతి వస్తువును కళాత్మకంగానే చూస్తారు. దాన్ని ఉపయోగించి ఎలాంటి కళాఖండం తయారుచేయవచ్చా అని తెగ ఆలోచిస్తారు. కొరియా దేశస్థులు తమకూ కళాత్మకహృదయం వుందని .... అది ఏరులై పొంగి పొర్లుతోందని నిరూపించుకున్నారు. అందుకు నిలువెత్తు నిదర్శనాలే ఈ బిస్కట్ల భవన సముదాయాలు. చూసి ఆనందించండికానీ తినడానికి ప్రయత్నించకండే. ఎందుకంటే ఇవి ఫొటోలు కదా.

మేఘం

పిచ్చుక కళ్లు తెరిచి చూసే సరికి తల్లి కనిపించలేదు. ఎత్తుగా వున్న చెట్టుపైకెక్కి కూర్చుని చుట్టూ చూసింది. కానీ దానికి ఎక్కడా తల్లి జాడ కనబడలేదు. తల్లి కనిపించక పోయేసరికి దిగులేసింది. బిక్కమొహమేసి కళ్లు మిటకరిస్తూ, దిక్కులు చూడసాగింది. ఇంతలో మేఘం మెల్లగా చెట్టు పక్కనుంచి వెళ్లసాగింది. పిచ్చుక మొహం చూసి, "ఎందుకలా వున్నావు? ఎవరేమన్నారు" అడిగింది మేఘం లాలింపుగా.

"మా అమ్మ కనబడ్డం లేదు" అంది దు:ఖం నిండిన గొంతుతో.

"మీ అమ్మ ఎక్కడికీ పోదు. తను ఆహారం తిని, నీకు తీసుకురావడానికి వెళ్లుంటుంది.వస్తుందిలే. దిగులు పడకు" అని ధైర్యం చెప్పింది.

కానీ పిల్ల పిచ్చుక దిగులు మానలేదు. "అమ్మను చూడాలి" అంది గోముగా.

"నాకు తెలిసినంత వరకు, మీ అమ్మ ముందు వైపుకే వెళ్లుంటుంది. ఎప్పుడూ అటే వెళుతుంది. నా వెంట వచ్చావంటే కనిపిస్తుంది. వస్తావా? నేనటే వెళుతున్నాను" అంది.

"వస్తానొస్తాను" అంది ఆనందంగా.

"అయితే, నా వీపు మీద కూర్చో. భువనగిరి ప్రాంతానికి వెళదాం" అంది మేఘం.

"ఎందుకూ?" అంది అర్థంగాక.

"అక్కడి ప్రజలకు ఎటువంటి నీటి సౌకర్యం లేదు. వాళ్లకు వర్షం పడితేనే పంటలు పండుతాయి. పంటలు పండితేనే గదా ఆహారం సమకూరేది"

"అయితే, నువ్వు ఎక్కడ ఎవరికి అవసరం వుంటే అక్కడికెళ్లి వర్షిస్తావా?" అడిగింది.

"అదేకదా నా విధి. నేను వర్షించకుంటే జనం కరువుతో చచ్చిపోతారు. మీ పక్షులక్కూడా ఇబ్బందే. మరి పంటలు వుండవు కదా" అంది.

"మేఘం పక్షితో మాట్లాడుతూ, భువనగిరి గుట్ట దాటి, చెలకలవైపు మళ్లింది.

"ఇక నువ్వు, ఈ చెట్టు మీద కూర్చో. మీ అమ్మ ఇటువైపే రావచ్చు" అంది మేఘం.

మేఘం మీదనుంచి దిగి, బుద్ధిగా చెట్టు మీద కూర్చుంది. ఇంతలో టపటపామని చినుకులు మొదలై వర్షం కురవసాగింది. పిచ్చుక కొమ్మ కింద కూర్చుని చూడసాగింది. వర్షం వెలియగానే నేలలోంచి అనేకరకాలైన పురుగులు వెలుపలకు వచ్చి భూమి మీద తిరగసాగాయి. పిచ్చుక నేల మీద వాలి ఆ పురుగుల్ని కడుపు నిండా తిన్నది. ఆకలి తీరిపోవడంతో తిరిగి చెట్టు పైకి చేరి, దిక్కులు చూడసాగింది.

ఇంతలో తల్లి పిచ్చుక వస్తూనే అంత దూరం నుంచే బిడ్డను చూసింది. సంతోషంతో వచ్చి, రివ్వున చెట్టు మీద వాలింది.

"ఎందుకమ్మా నాకు చెప్పకుండా వెళ్లావు?' అంది బుంగమూతి పెట్టి.

"అప్పుడు నువ్వు నిద్రపోతున్నావమ్మా. లేపడం ఎందుకని వెళ్లిపోయాను. ఇంతకూ ఏవన్నా తిన్నావా లేదా?" అంది పొట్ట చూస్తూ.

"తిన్నానమ్మా. నన్నిక్కడకు మేఘం మామయ్య మోసుకొచ్చాడు. బోలెడంత ఆహారం దొరికేలా చేశాడు. తను కనిపించడేం. అడిగింది మేఘం కనిపించకపోవడంతో.

"తనిప్పుడు వర్షంగా మారి నేల మీద ప్రవహిస్తున్నాడు" అని పారుతున్న నీళ్లను చూపించింది.

"మామయ్య చాలా మంచివాడమ్మా. నా దిగులు చూసి, ఇక్కడిదాకా మోసుకొచ్చాడు. చక్కటి ఆహారమిచ్చాడు. రైతుల బీడు నేలలకు నీళ్లనిచ్చాడు. ఆ మావయ్యను మళ్లీ చూడలేమా అమ్మా?!" అడిగింది.

"ఎందుకు చూడలేం! ఈ కింద కురిసిన వర్షమంతా ఎండకు ఆవిరై మళ్లీ మేఘంగా తయారౌతాడు. అప్పుడు చూడొచ్చు"అంది.

"అంటే మనం నివసించే చెట్టు దగ్గరలోనే చాలా మంది కష్టజీవులున్నారు. వాళ్ల కళ్లల్లో ఎప్పుడూ చూడొచ్చన్నమాట" అనుకుంది.

తర్వాత తల్లి వెంట తాముండే గూటివైపు వెళ్లడానికి రెక్కలు విప్పింది.

-పుప్పాల కృష్ణమూర్తి